RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ | 04 మార్చ్ 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:231

# ప్రభుత్వ పథకాలు ప్రజలలోకి తీసుకుపోవాలి

## కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచనలు,



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** 99 రోజుల కార్యక్రమాల్లో వార్డు సభ్యులు, సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, ఛైర్మన్లు, కార్పొరేటర్లు, మేయర్లను భాగస్వాములను చేయాలి....

వార్డు సభ్యులు, సర్పంచులు, ఛైర్మన్లు, కార్పొరేటర్లు, మేయర్లు అందరికీ జిల్లా కేంద్రాల్లో ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలి.. వారి విధులు, బాధ్యతలకు సంబంధించి అవగాహన కల్పించడంతో పాటు ప్రింటెడ్ మెటీరియల్ వారికి అందించాలి...

సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలి. వ్యవసాయ పంప్ సెట్లకు బదులు సోలార్ పంప్ సెట్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలి.. సోలార్ మోటార్లతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలి. ఇళ్లపైన సోలార్ ప్లాంట్లు అమర్చుకోవడం.. సోలార్ విద్యుత్ వాడుకోవటం తో పాటు గ్రిడ్ కు కనెక్ట్ చేయడం ద్వారా వచ్చే ఆదాయంపై అన్ని గ్రామాల్లో విద్యుత్ శాఖ అవగాహన కల్పించాలి...

గ్రామ, వార్డు సభల్లో నూతనంగా ఇచ్చిన రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200లోపు యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ లబ్ధిదారుల వివరాలు తెలియజేయాలి. వాటితో గ్రామ, మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయి కలిగిన లబ్ధిని ప్రజలకు వెల్లడించాలి..

రాష్ట్రంలో ఉన్న 35 ప్రభుత్వ మెడికల్ కళాశాలల సేవలు ప్రజలకు అందేలా చూడాలి. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఇతర స్థానిక వైద్య సంస్థలు ప్రభుత్వ మెడికల్ కళాశాలలకే రిఫర్ చేయాలి.. మెడికల్ కళాశాలల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలు, వైద్య విద్యార్థులు, వైద్యులు, ప్రొఫెసర్లు ఉన్నారు.. వారి సేవలు సద్వినియోగం చేసుకోవాలి....

ప్రతి ప్రభుత్వ పథకం లబ్ధిదారుల ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నైజేషన్) చేపట్టాలి.. అర్హులకు కచ్చితంగా లబ్ధి జరగాలి. అదే సమయంలో అనర్హులు లబ్ధిపొందకూడదు. ఆసరా పింఛన్లలో ముఖ గుర్తింపు చేపట్టడంతో 3 లక్షల మంది అనర్హుల పేర్లు తొలగించగలిగాం.. సాంకేతికతను సరిగా వినియోగించుకోకపోవడంతోనే ఇంత పెద్ద సంఖ్యలో అనుచిత లబ్ధి పొందారు.

రవాణా శాఖ డాటా ఆన్‌లైన్ పూర్తి చేయాలి. పాఠశాలలు బస్సులు, ఇతర వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు సక్రమంగా నిర్వహించాలి. ఆర్టీసీ బస్సు డ్రైవర్లతో పాటు లారీలు, ఇతర సరకు రవాణా వాహనాల డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించాలి. ఎక్కువ సంఖ్యలో డ్రైవర్లు కలుసుకునే చోట్లనే ఈ శిబిరాలు ఏర్పాటు చేసి వారికి పరీక్షలు నిర్వహించాలి..

రహదారులపై భారీ స్థాయిలో గుంతలు, ప్రమాదం జరిగే స్థలాల వివరాలు తెలుసుకునేందుకు వాట్సాప్ నెంబర్ ను రవాణా శాఖ ఇవ్వాలి. ఆ నంబర్‌కు వచ్చే సమాచారం ఆధారంగా అక్కడ మరమ్మతులు చేపట్టడం, ఇతర జాగ్రత్తలు తీసుకోవడం చేయాలి.

ఓఆర్ఆర్, ఓఆర్ఆర్ సర్వీసు రోడ్ల వెంట భారీగా చెత్త, ఇతర నిర్మాణ వ్యర్థాలు డంప్ చేస్తున్నారు. వ్యర్థాలను తీసుకువచ్చే వాహనాలను పట్టుకొని జరిమానాలు విధించాలి. కేసులు పెట్టాలి. ఓ ఆర్ ఆర్ ఏజెన్సీని బాధ్యులను చేయాలి .

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ప్రతి నెలా బిల్లులు




ఎలాంటి ఇబ్బంది లేకుండా చెల్లించాలి. పిల్లలకు పోషకాహారం అందాలి. అందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలి.

మూడు కార్పొరేషన్లతో పాటు నగరాలు, పట్టణాల్లోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు, బాయ్స్, గరల్స్ హాస్టళ్ల వివరాలు నమోదు చేసుకోవాలి. ఆయా హాస్టళ్ల ఏర్పాటుకు అనుమతులు, వాటిపై పర్యవేక్షణ ఉండాలి. వాటి యాజమాన్యాలకు జవాబుదారీతనం ఉండాలి...

పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి, డ్రగ్స్, ఈ-సిగరెట్ల వినియోగం జరిగితే అందుకు ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలు బాధ్యత వహించాలి.. ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాల, కళాశాలల్లో సబ్జెక్ట్ టీచర్స్, పీఈటీ ఎలా ఉంటారో అలానే సైకాలజిస్ట్ ఉండేలా చూడాలి...

వ్యవసాయ శాఖ భూసార పరీక్షలు చేపట్టి సకాలంలో రైతులకు వాటి సమాచారం అందజేయాలి.. ఏ భూమిలో ఏ పంట బాగా పండుతుంది అనే విషయం రైతులకు తెలియజేయాలి.. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసేలా అన్నదాతలను ప్రోత్సహించాలి...పంట మార్పిడి, పంటల వైవిధ్యత ప్రయోజనాలను వివరించాలి..

యూరియా యాప్‌లో కొంత గందరగోళం ఉన్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. దానిని సులువుగా వినియోగించేలా మార్పులు చేయాలి.. నానో యూరియా ఉపయోగాలను క్షేత్రస్థాయిలో ప్రదర్శన ద్వారా రైతులకు చూపించాలి...

వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ పరస్పరం సమన్వయంతో ముందుకు సాగాలి. పంటలు వేసే మొదలు పంట ఉత్పత్తుల అమ్మకం వరకు సరైన కార్యాచరణ ప్రణాళిక ఉంటేనే ఇబ్బందులు ఎదురుకావు. ఈ విషయంలో ఈ రెండు శాఖలు పరస్పర సహకారంతో ముందుకుసాగాలి.

కలెక్టర్లు తమ తమ జిల్లాల్లో పంటల వైవిధ్యతకు ఉన్న అవకాశాలపై నివేదిక సమర్పించాలి...

# సౌదీ, బహ్రెయిన్ పాలకులకు మోదీ ఫోన్



న్యూఢిల్లీ, సౌదీ, బహ్రెయిన్ పాలకులకు మోదీ ఫోన్‌సౌదీ అరేబియా, బహ్రెయిన్‌లపై జరిగిన దాడులను ప్రధాని నరేంద్ర మోదీ ఖండించారు. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్, బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫాలకు ఫోన్ చేసి మాట్లాడిన ప్రధాని, ఆ రెండు దేశాల్లోని భారతీయుల క్షేమంపై ఆరా తీశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు, ఆపై ఇరాన్ ప్రతిదాడులతో పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.



**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:** గాంధీ భవన్ లో హోలీ పండుగ సందర్భంగా టి పి సి సి అధ్యక్షులు ,MLC బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నీకలసి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియాచేసినకె. ఎస్. ఆనంద్ రావు సీనియర్ కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ.

# నలుగురు బీసీ నేతలు రాజ్యసభ అవకాశం కోరుతున్నారు: మహేశ్ కుమార్ గౌడ్

## కార్పొరేట్లకే బీఆర్ఎస్ రాజ్యసభ అవకాశం ఇచ్చిందన్న మహేశ్ గౌడ్

## తెలంగాణ కోసం పోరాడిన వారిని విస్మరించిందని విమర్శ

## లొంగిపోయిన మావోలు కాంగ్రెస్ లోకి వస్తే ఆహ్వానిస్తామని వ్యాఖ్య



తెలంగాణ రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సమర్థులైన నలుగురు బీసీ నేతలు రాజ్యసభ అవకాశం కోరుతున్నారని, ఒకటి లేదా రెండు స్థానాల కేటాయింపుపై రేపు స్పష్టత వస్తుందని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ కేవలం కార్పొరేట్ శక్తులకే పెద్దల సభలో అవకాశం ఇచ్చిందని, తెలంగాణ కోసం పోరాడిన వారిని విస్మరించిందని ఆయన విమర్శించారు. అలాగే, మార్చి నెలలో కార్పొరేషన్ పదవుల భర్తీ ఉంటుందని వెల్లడించారు.

మావోయిస్టుల అంశంపై స్పందిస్తూ... దశాబ్దాలుగా సిద్ధాంతం కోసం పనిచేస్తున్న వారి పట్ల తమకు గౌరవం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్‌తో చర్చలకు సిద్ధపడి, మావోయిస్టులతో చర్చలకు నిరాకరించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఆపరేషన్ కగార్‌ను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని పేర్కొంటూ, లొంగిపోయిన మావోయిస్టులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తే సాదరంగా ఆహ్వానిస్తామని స్పష్టం చేశారు.

# కలెక్టర్లు ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలి

## ప్రభుత్వ ఆలోచనలు ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలి. పొంగులేటీ శ్రీనివాస్‌రెడ్డి



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** ఇటీవల బాధ్యతలు చేపట్టిన జోగులాంబ గద్వాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ తదితర జిల్లాల కలెక్టర్లు మంగళవారంనాడు సచివాలయంలో మంత్రి పొంగులేటీ శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని, ప్రజలతో మమేకం కావాలని, ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలని వారికి సూచించడం జరిగింది.

ఐఏఎస్ అధికారుల కెరీర్లో జిల్లా కలెక్టర్లుగా పని చేయడం కీలకమని, ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలుండే బాధ్యతలతో పాటు క్షేత్ర స్థాయిలో అన్ని అంశాలపై అవగాహన వస్తుందని, జిల్లాల్లో పని చేసిన అనుభవమే భవిష్యత్తులో ఉపయోగపడుతుందని చెప్పడం జరిగింది.





ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజాపాలనలో ప్రజాకేంద్రంగా పాలన సాగాలని , ప్రజలకు మేలు చేసే పనులనే జిల్లా పాలకులుగా చేపట్టాలని తెలియజేయడం జరిగింది.

రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాల ఫలాలు అర్హులైన ప్రతిఒక్కరికి అందించవలసిన బృహత్తర బాధ్యత కలెక్టర్లపైనే ఉందని స్పష్టం చేయడం జరిగింది.

# కచ్చితంగా మూసీని, తెలంగాణ వనరులను పరిరక్షించుకుంటాం

## నర్సింగిలో మూసీ నదిని ఆక్రమించి నిర్మిస్తోన్న భారీ రియల్ ఎస్టేట్ వెంచర్ పై చర్యలు చేపట్టాలి స్థానికులతో ఆందోళన చేపట్టిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ మార్చ్ 3 ;నర్సింగిలో మూసీ నదిని ఆక్రమించి నిర్మిస్తోన్న భారీ రియల్ ఎస్టేట్ వెంచర్ పై చర్యలు చేపట్టాలని కోరుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్థానికులతో ఆందోళన చేపట్టారు.గాంధీ సరోవర్ ప్రాజెక్టులో భాగంగా ప్రజల నివాసాలు తొలగిస్తామని చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, పేదల ఇండ్లు కూల్చేసే హైడ్రాకు ఈ అక్రమ వెంచర్ కనిపించడం లేదా అని నినాదాలు



చేసారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మూసీ నదిలోనే భారీ అంతస్తుల భవనాలను కడుతుంటే హైడ్రాకు కనబడటం లేదు. కానీ కుత్బుల్లాపూర్ లో పేదల ఇళ్లను కూల్చేశారు. ఖమ్మంలోని వెలుగుమట్లలో పేదల ఇళ్లను అక్రమంగా కూల్చేశారు. మూసీలో కూడా పేదవాళ్ల ఎంతో మంది ఇళ్లను కూల్చేశారు. కానీ మూసీ లో కడుతున్న ఈ బిల్డింగ్ మాత్రం హైడ్రా రంగనాథ్ కు , ప్రభుత్వానికి కనబడటం లేడా అని ప్రశ్నించారు..రంగనాథ్ గారికి ఫోన్ చేస్తే కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో ఉన్నానని చెప్పారు. ఆయన బుల్డోజర్లు తెచ్చే వరకు కూడా మేమంతా ఇక్కడే ఉంటాం. జనం బాటలో భాగంగా చెరువులు, నదులు అక్రమించి కట్టిన బిల్డింగ్ ల గురించి మనం కంప్లైంట్స్ ఇచ్చాం. కానీ ఇప్పటి వరకు ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోలేదు. అదే ఖమ్మంలోని వెలుగుమట్లలో 600 మంది పేదల ఇళ్లు కూల్చేశారు.. త్వరలోనే అక్కడకు వెళ్తాం మన్నారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరుతో సిటీలోని మధు రిడ్జ్ అపార్ట్ మెంట్ వాళ్లను కూడా ఇబ్బంది పెడుతున్నారు. ఎంతో మంది మధ్య తరగతి వాళ్లు కష్టపడి అక్కడ అపార్ట్ మెంట్లు కొనుక్కున్నారు. దాదాపు 20 ఏళ్ల క్రితం కట్టిన ఆ అపార్ట్ మెంట్ వాళ్లను ఇబ్బంది పెడుతున్నారు. కానీ ఇక్కడ ఇప్పుడిప్పుడే కడుతున్న, ఎవరికీ నష్టం లేని బిల్డింగ్ ను మాత్రం ఆపటం లేదు. మాకు ప్రైవేట్ వాళ్లతో ఎలాంటి పంచాయితీ లేదు. ప్రభుత్వంతోనే మా పంచాయితీ. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఈ బిల్డింగ్ ల నిర్మాణానికి పర్మిషన్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆరు నెలల పాటు ఈ నిర్మాణాలను ఆపారు. కానీ ఆ తర్వాత ఆమ్యమ్యాలు తీసుకొని మళ్లీ నిర్మాణాలకు పర్మిషన్ ఇచ్చారు. న్యాయం అందరికీ ఒకే విధంగా ఉండాలన్నదే మా పోరాటం. కచ్చితంగా మూసీని, తెలంగాణ వనరులను పరిరక్షించుకుంటామని కవిత పేర్కొన్నారు.

# ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికపై హైకోర్టు తుది తీర్పు

## మూడు వారాల్లోగా ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు

హైదరాబాద్ మార్చ్ 3 ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికపై హైకోర్టు తుది తీర్పు ఇచ్చింది. మూడు వారాల్లోగా ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి మంగళవారం తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కౌన్సిలర్లు ఎలాంటి ఒత్తిడికి లోనవకుండా తమ మద్దతు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని వెల్లడించింది.మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరగాల్సిన సమయంలో 19వ కార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆకుల యాదగిరి కనిపించకుండా పోయాడు. దీంతో తన తండ్రిని ప్రత్యర్థి పార్టీ నేతలు



కిడ్నాప్ చేశారంటూ యాదగిరి కుమారుడు హైకోర్టులు హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియపై స్టే విధించింది. మంగళవారం ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను మూడు వారాల్లోపు పూర్తి చేయాలని తుది తీర్పును వెలువరించింది .

# హోలీ సంబరాల్లో 10 వ వార్డ్ మహిళలు



ప్రజాబలం దినపత్రిక మార్చి -03 వేములవాడ పట్టణంలోని హోలీ పండగని 10వ వార్డు మహిళలు కన్నుల పండుగగా జరుపుకున్నారు. సాంప్రదాయానుగుణంగా రంగులతో ఒకరికొకరు పోసుకుంటూ చిన్న పెద్ద అనే భేదం లేకుండా హోలీ పండుగను కుటుంబంలో కలిసి పండుగగా జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో తోట రజిత, తోట మమత, పంపరి సంజీవ, పంపరి మీనాక్షి, పంపరి మమత, నర్సవ్వ, దివిటి లావణ్య, సరిపెల్లి రమ్య,పిల్లలు పంపరి కృతిక్, పంపరి కౌశిక, మహనీత్, తోట శ్రావణి, తోట కాత్యాయని,

# ద్రవ్యోల్బణం అంటే ఏమిటి..అది మనపై ఏలాంటి ప్రభావం చూపుతుంది ?




హైదరాబాద్ మార్చ్ 3 ;ద్రవ్యోల్బణం అంటే వస్తువులు, సేవల ధరలు పెరగడం. ఇది సామాన్యుడి కొనుగోలు శక్తిని తగ్గిస్తుంది, జీవన వ్యయాన్ని పెంచుతుంది. మీ సంపాదనతో తక్కువ వస్తువులే కొనగలుగుతారు, దీనివల్ల కుటుంబ ఖర్చులు పెరిగి పొదుపు తగ్గుతుంది. ఆహారం, ఇంధనం వంటి నిత్యావసరాల ధరలు ?? మధ్యతరగతిపై భారం పెరుగుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థలో తరచుగా వినిపించే పదం ద్రవ్యోల్బణం. అయితే అసలు ద్రవ్యోల్బణం అంటే ఏంటి? ఇది సామాన్యుడి రోజువారీ జీవితంపై ఎలా ప్రభావం చూపుతుంది? అనే ప్రశ్నలు ప్రజల్లో ఎక్కువగా వినిపిస్తున్నాయి. నిపుణుల వివరణ ప్రకారం.. మార్కెట్లో వస్తువులు, సేవల ధరలు కాలక్రమేణా పెరగడాన్ని ద్రవ్యోల్బణం అంటారు. అంటే ఈరోజు రూ.100కు కొనుగోలు చేసే వస్తువు కొంతకాలం తర్వాత రూ.110 లేదా అంతకంటే ఎక్కువ కావడం ద్రవ్యోల్బణానికి ఉదాహరణ. ద్రవ్యోల్బణం పెరిగితే మొదట ప్రభావం పడేది సామాన్యుడి కొనుగోలు శక్తిపై. జీతం అదే స్థాయిలో ఉన్నా, వస్తువుల ధరలు పెరగడంతో అదే డబ్బుతో తక్కువ వస్తువులు మాత్రమే కొనగలుగుతారు. దీనివల్ల కుటుంబ ఖర్చులు పెరిగి పొదుపు తగ్గిపోతుంది. ముఖ్యంగా మధ్యతరగతి, తక్కువ ఆదాయ వర్గాలపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆహారం, ఇంధనం, అద్దె, విద్య, వైద్యం వంటి అవసరాల ధరలు పెరిగితే గృహ బడ్జెట్ కుదేలవుతుంది. ఉదాహరణకు కూరగాయలు లేదా పెట్రోల్ ధరలు పెరిగితే దాని ప్రభావం నేరుగా ప్రతి కుటుంబానికి తాకుతుంది. రవాణా ఖర్చులు పెరగడం వల్ల ఇతర వస్తువుల ధరలు కూడా పెరిగే అవకాశం ఉంటుంది. అయితే ద్రవ్యోల్బణం పూర్తిగా ప్రతికూలం మాత్రమే కాదు. మితమైన స్థాయిలో ఉన్నప్పుడు ఇది ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ పెరుగుదలకు సంకేతంగా పరిగణిస్తారు. కానీ అధిక స్థాయికి చేరితే జీవన వ్యయం భారంగా మారుతుంది. అందుకే కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్ల మార్పులు వంటి చర్యల ద్వారా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ప్రయత్నిస్తుంటాయి. మొత్తంగా చూస్తే, ద్రవ్యోల్బణం పెరుగుదల సామాన్యుడి జేబుపై నేరుగా ప్రభావం చూపుతుంది. కాబట్టి ఖర్చులను ప్లాన్ చేసుకోవడం, పొదుపు అలవాటు పెంచుకోవడం, దీర్ఘకాల పెట్టుబడులు పెట్టడం వంటి చర్యలు తీసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# వేట్లపాలెం ఘటనకు కారణాలేమిటి..సమగ్ర విచారణ జరిపించాలి

## ఐహెచ్ఆర్ ఏ ఆంధ్ర ప్రదేశ్ సివిల్ రైట్స్ చర్మెన్ కరణం తిరుపతి నాయుడు డిమాండ్

అమరావతి మార్చ్ 3 ;కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని సూర్యశ్రీ ఫైర్ వర్స్క్ భారీ విస్ఫోటనం ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధితులకు సరైనా న్యాయం చేయాలని ఐహెచ్ఆర్ ఏ ఆంధ్ర ప్రదేశ్ సివిల్ రైట్స్ చర్మెన్ కరణం తిరుపతి నాయుడు డిమాండ్ చేసారు. పేలుడు జరిగిన సమయంలో సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ 40 మంది పని చేస్తున్నట్లు తెలు స్తోందని, వివిధ రూపాల్లో 30 మంది చనిపోయారని, సంఘటన జరిగి 3 రోజులు గడుస్తున్నా మిగిలిన 10 మంది ఏమయ్యారనే ప్రశ్నకు ఇప్పటి వరకూ జవాబు దొరకపోవడం ఆందోళన కర విషయమన్నారు. శనివారం ఘటనా స్థలంలో 20 మం ది సజీవ దహనం కాగా.. చికిత్స పొందుతూ ఆదివారం ఇద్దరు మరణించారు. మరో ఏడు గురు కాకినాడ జీజీహెచ్లో చికిత్స పొందు తున్నారు. ఒకరు ప్రమాదం నుంచి తప్పిం చుకున్నారు. ఈ 30 మంది కాకుండా మిగిలిన 10 మంది ఏమయ్యారని ఆయన ప్రశ్నించారు. దీనిని నిర్ధారించాలంటే సీసీ కెమెరాల పుటేజే ఆధారం. ఆ దిశగా అధి కారులు దర్యాప్తు చేస్తారో లేదో ప్రస్నార్ధాకంగా మారిందన్నారు.నిబంధనల ప్రకారం ప్రతీ బాణసంచా



తయారీ కేంద్రం. షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఈ నిబంధన ప్రకారం సూర్యశ్రీ ఫైర్ వర్స్క్ కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు సమాచారం. తయారీ కేంద్రం యజమాని ఎక్కడున్నా సీసీ కెమెరాల్లోని దృశ్యాలు ఆయన సెల్ఫోన్లో రికా రవుతాయి. ఈ ప్రమాదంలో సీసీ కెమెరాలు పూర్తిగా కాలిపోయినా.. సెల్ఫోన్లో నిక్షిప్తమైన వీడియో దృశ్యాలు లభించే ఆవకాశం ఉంది. ఈ రికార్డులను పరిశీలిస్తే తొలుత విస్ఫోటనం ఎక్కడ జరిగింది.. ఎక్కడి నుంచి, ఏవిధంగా మంటలు చెల -రేగాయి.. ఆ సమయంలో అక్కడ ఎంతమంది పని చేస్తున్నారనే అంశాలపై స్పష్టత వస్తుందన్నారు.సూర్య శ్రీ ఫైర్ వర్స్క్ లైసెన్స్ అడబాల అర్జున్ పేరిట ఉంది. దీని నిర్వహణలో అర్జున్ తో పాటు ఆయన సోదరుడు నాని, తండ్రి శ్రీనివాసరావు కూడా పాలుపంచుకుంటున్నారని,ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు మరణించగా... అర్జున్, నానిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తండ్రి మరణించిన నేపథ్యంలో వారికి నోటీసు ఇచ్చి విడిచిపెట్టామని పోలీసులు చెబుతుండగా.. ఆది అవా స్తవమని, తండ్రికి తలకొరివి పెట్టేందుకు కూడా వారిని అనుమతించలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మరోవైపు అన్నదమ్ములిద్దరినీ అదుపు లోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి ఏ సమాచారం రాబట్టారనే విషయాన్ని ఇప్పటివరకూ గోప్యంగానే ఉంచారని,బాధ్యులను తప్పించడానికి రాష్ట్ర హోం మంత్రి యత్నిస్తున్నారని తిరుపతి నాయుడు ఆరోపించారు.

# సంపూర్ణ చంద్రగ్రహణం నేపథ్యంలో ఆలయాల మూసివేత



హైదరాబాద్ మార్చి3: నేడు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడనున్న నేపథ్యంలో వేములవాడ, యాదగిరిగుట్ట, బాసర ,భద్రాచలం, కీసర లతో పాటు దాదాపు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆలయాలను మూసివేశారు. వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రాచలం, బాసర, కీసర సహా అన్ని ప్రధాన ఆలయాలతో పాటు చిన్న ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం మూసివేశారు. చంద్రగ్రహణం అనంతరం సాయంత్రం 7 గంటలకు సంప్రోక్షణ చేసి, తిరిగి ఆలయాలను తెరవనున్నారు.

# గ్రామపంచాయితీలకు ఎల్ఆర్ఎస్, బీపీఎస్ ఆదాయాలు

విజయవాడ, మార్చి 3, గ్రామ పంచాయితీల ఆర్థిక ఇబ్బందులను దూరం చేసేలా ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్ఆర్ఎస్ , బీపీఎస్ పథకాల ద్వారా వచ్చే ఆదాయంలో గ్రామ పంచాయితీలకు వాటా ఇవ్వాలని నిర్ణయించింది. గ్రామ పంచాయితీలకు 50 శాతం,, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు 30 శాతం, ఏపీ టౌన్ ప్లానింగ్ విభాగానికి 20 శాతం నిధులు చొప్పున కేటాయించాలని నిర్ణయించింది. ఈ కొత్త విధానంతో గ్రామ పంచాయితీలకు నిధుల కొరత తగ్గుతుందని అధికారులు చెప్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గ్రామ పంచాయితీలకు మంచి రోజులు రానున్నాయి. లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామ పంచాయితీలతో పంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామ పంచాయితీలకు ఆర్థిక ప్రోత్సాహం అందించేందుకు గానూ ఈ నిర్ణయం తీసుకుంది. కొత్త విధానం కింద గ్రామ పంచాయతీలు తమ పరిధిలో ఎల్ఆర్ఎస్, బీపీఎస్ పథకాల కింద సమీకరించిన ఆదాయంలో సగం వాటాను పొందుతాయి. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు 30 శాతం ఆదాయాన్ని కేటాయిస్తారు. మిగిలిన 20 శాతం రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగానికి వెళ్తుంది. చాలా వరకూ గ్రామ పంచాయితీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో.. ఈ విధానం ప్రకారం వాటికి కావాల్సిన నిధులు అందజేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.స్థానిక సంస్థల సాధికారత విషయంలో ఏపీ ప్రభుత్వం చిత్తశుద్ధిని ఈ నిర్ణయం తెలియజేస్తోందని ఏపీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ వెల్లడించారు. ఈ విధానం ప్రకారం క్రమబద్ధీకరణ పథకాల ద్వారా సమీకరించిన నిధులను తిరిగి అదే ప్రాంత అభివృద్ధి కోసం పెట్టుబడి పెట్టనున్నట్లు వివరించారు. గ్రామ పంచాయతీలకు సగం ఆదాయం కేటాయించడం ద్వారా, ప్రభుత్వం గ్రామీణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, ప్రాథమిక సౌకర్యాలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు.అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ వంటి కనీస అవసరాలైన పనులకు కూడా నిధులు లేక పంచాయితీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. అనేక గ్రామ పంచాయతీలు సాధారణ పారిశుధ్య పనులను కూడా చేపట్టలేకపోతున్నాయి. ఎక్కువగా ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లపై ఆధారపడతున్నాయి.ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఒఖీూ, ఃఖూ ఆదాయాలు స్థిరంగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో.. గ్రామ పంచాయతీలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను చేపట్టేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెప్తున్నారు. సుదీర్ఘ చర్చల అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఉన్నతాధికారులు వెల్లడించారు. రెగ్యులరైజేషన్ పథకాల ద్వారా సేకరించిన నిధులను స్థానికంగానే ఖర్చు చేయనున్న నేపథ్యంలో ఎక్కువ మంది తమ ఆస్తుల రెగ్యులరైజేషన్ కోసం ముందుకు వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఈ నిర్ణయం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# రేషన్ షాపులోకందిపప్పు, రాగులు లేనట్లే..

విజయవాడ, మార్చి 3, ఏపీ ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకూ రేషన్ దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ చేపడుతున్న సంగతి తెలిసిందే. మార్చి నెల ప్రారంభం కావటంతో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ సరుకుల పంపిణీ మొదలైంది. అయితే విశాఖపట్నం, అల్లూరి జిల్లా రేషన్ కార్డుదారులకు మాత్రం ఈ నెలలో కందిపప్పుతో పాటుగా రాగులు పంపిణీ కూడా జరగడం లేదు. కందిపప్పు పంపిణీ రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోగా.. గత మూడు నెలలుగా పంపిణీ చేసిన రాగులు కూడా విశాఖ, అల్లూరి జిల్లావాసులకు ఈసారికి అందుబాటులో లేకుండా పోయాయి.ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రేషన్ కార్డుదారులకు రేషన్ సరుకుల పంపిణీ మొదలైంది. మార్చి ఒకటో తేదీ నుంచి నిత్యావసర సరుకులను రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్నారు. లబ్ధిదారులకు బియ్యంతో పాటుగా అరకిలో పంచదార, కిలో గోధుమపిండి కూడా అందించనున్నారు. కొన్ని చోట్ల జొన్నలు, రాగుల పంపిణీ కూడా జరుగుతోంది. అయితే విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల వంటి చోట్ల రాగుల పంపిణీ జరగడం లేదు. గత మూడు నెలలుగా రేషన్ కార్డుదారులకు రాగులను పంపిణీ చేశారు. అయితే మార్చి నెలలో మాత్రం ఇచ్చే పరిస్థితి లేనట్లు తెలిసిందిఅవసరాలకు తగిన మొత్తంలో రాగులు సరఫరా కాలేదని సమాచారం. ముఖ్యంగా ఒడిశా నుంచి రావాల్సిన రాగులు రాలేదని.. దీంతో విశాఖపట్నం, అల్లూరి జిల్లాలలో రాగుల పంపిణీ జరగనట్లు సమాచారం. మరోవైపు ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకూ ఆదివారాలతో సహా రేషన్ షాపులు.. లబ్ధిదారులకు అందుబాటులో ఉండనున్న సంగతి తెలిసిందే. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ, అలాగే సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ రేషన్ దుకాణాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయి.మరోవైపు ఏపీలో రేషన్ కార్డుదారులకు బియ్యం, పంచదార, గోధుమపిండి, రాగులు, జొన్నలు పంపిణీ చేస్తున్నప్పటికీ.. కందిపప్పు సరఫరా మాత్రం జరగడం లేదు. బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధరలు చుక్కలను తాకుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రాయితీపై కందిపప్పు అందిస్తే మధ్యతరగతి జీవికి కాస్త ఊరటగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఏపీలో కందిపప్పు పంపిణీ నిలిచిపోయి సుమారుగా ఏడాది కావొస్తోంది.బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు నాణ్యత ఆధారంగా ధర రూ.110 నుంచి రూ.120 వరకూ పలుకుతోంది. రేషన్ దుకాణాల్లో కిలో కందిపప్పు. రూ.67లకే అందించేవారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు సరఫరా చేయాలని జనం కోరుతున్నారు. అయితే పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. టీడీపీ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన కొత్తల్లో కొన్ని నెలలు పాటు కందిపప్పు సరఫరా చేశారు. ఆ తర్వాత కందిపప్పు పంపిణీ నిలిచిపోయింది.

# బెజవాడలో కొత్త ఎలివేటెడ్ ఫ్లై ఓవర్

విజయవాడ, మార్చి 3,విజయవాడ నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడనుంది. ఈ మేరకు కొత్త ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ నిర్మించేందుకు ఏపీ ప్రభుత్వం రెడీ అయింది. హైదరాబాద్-మచిలీపట్నం జాతీయ రహదారిలో విజయవాడ నగర పరిధిలో ఉన్నంత మేరకు.. ఆ మార్గంలో ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ నిర్మించే ప్రతిపాదనను సర్కార్ పరిశీలిస్తోంది. పండిట్ నెహ్రూ బస్టాండ్ సమీపంలోని రాజీవ్ పార్క్ వద్ద కనకదుర్గ ఫ్లైఓవర్ నుంచి మె?దలుకొని మచిలీపట్నం వైపు వెళ్లే మార్గంలోని గంగూరు కూడలి వరకు మె?త్తంగా 14 కి.మీ. మేర ఈ పైవంతెన నిర్మించాలని భావిస్తున్నారు. ఆరు వరుసలతో నిర్మించే ఫ్లై ఓవర్ కారణంగా హైవేలో ప్రయాణించే వారికి ఏ ఆటంకాలూ ఉండవని, విజయవాడ నగర ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడుతుందని అధికారులు యోచిస్తున్నారు. ఈ ప్రాజెక్టును ఎలా చేపట్టవచ్చన్న భిన్న ప్రణాళికలపై ఢిల్లీ స్థాయిలో ఎన్‌హెచ్ఏఐ అధికారులు చర్చిస్తున్నారు.హైదరాబాద్- విజయవాడ- మచిలీపట్నం హైవే-65పై విజయవాడ పరిధిలో ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, భవానీపురం, కనకదుర్గ ఫ్లైఓవర్, కృష్ణలంక, వారధి జంక్షన్, బెంజ్ సర్కిల్, ఆటోనగర్ గేట్, కానూరు, పోరంకి, పెనమలూరు మీదుగా ఈ ఫ్లై ఓవర్ నిర్మించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్-విజయవాడ మధ్య ఎన్‌హెచ్-65ను నాలుగు నుంచి ఆరు వరుసలుగా విస్తరించేందుకు ప్రాజెక్ట్ చేపట్టారు. దీన్ని గొల్లపూడి వద్ద విజయవాడ బైపాస్ క్రాస్ అయ్యే పాయింట్ వరకే విస్తరించాలని ముందుగా భావించారు. ఆ తర్వాతా రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు భవానీపురం వద్ద కనకదుర్గ ఫ్లైఓవర్ దాకా విస్తరించేందుకు ఎన్‌హెచ్ఏఐ ఒప్పుకుంది. ఈ మేరకు డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. విజయవాడ-మచిలీపట్నం హైవేను ఆరు వరుసలుగా విస్తరించే ప్రాజెక్ట్ కూడా చేపడుతున్నారు. విజయవాడ నగర పరిధిలో కనకదుర్గ ఫ్లైఓవర్ తర్వాతి నుంచి కృష్ణలంక, వారధి జంక్షన్, స్క్రూబ్రిడ్జి, బెంజ్ సర్కిల్, కానూరు, పోరంకి, పెనమలూరు, గంగూరు, కంకిపాడు మీదుగా దావులూరు టోల్‌ప్లాజా వరకు నాలుగు వరుసలుగానే ఈ రహదారి మిగిలిపోనుంది. వాహన రద్దీ ఎక్కువగా ఉండే విజయవాడ నగరం మధ్యలో నాలుగు వరుసలుగా మిగిలిపోతే ఎలాగన్న ప్రశ్న తలెత్తింది. దీనికి విజయవాడలో ఆరు వరుసలతో ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ నిర్మించడమే పరిష్కారమన్న అంచనాకు అధికారులు వచ్చారు. తద్వారా కనకదుర్గ ఫ్లైఓవర్ నుంచి గంగూరు కూడలి వరకు ఆరు వరుసలతో ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

# త్వరలో లోకేష్ కు పట్టాభిషేకం ఊహాగానాలు

విజయవాడ, మార్చి 3, ఆంధ్రప్రదేశ్ లో నారా లోకేష్ సీఎం అనే చర్చ అప్పుడప్పుడూ తెరపైకివస్తోంది. ఇటీవలి కాలంలో లోకేష్ కు పట్టాభిషేకం చేస్తారన్న సోషల్ మీడియాలో తరచూ టాపిక్ వైరల్ అవుతోంది. నిజానికి లోకేష్ డిప్యూటీ సీఎం అనే ప్రచారం కొంత కాలం సాగింది. టీడీపీ నేతలు కూడా వరుసగా ప్రకటనలు చేశారు. కానీ ఇలాంటి ప్రకటనలు చేస్తే ఊరుకునేది లేదని హైకమాండ్ హెచ్చరించడంతో అందరూ సైలెంటు అయిపోయారు. కానీ ఇప్పుడు సీఎం చర్చ వస్తోంది. టీడీపీలో చంద్రబాబు తర్వాత లోకేష్ దే నాయకత్వం. చంద్రబాబు ఇప్పటికిప్పుడు వైదొలిగే అవకాశాలు లేవు. ఎందుకంటే చంద్రబాబుకు దీర్ఘకాలిక లక్ష్యాలు ఉన్నాయి. గతంలో లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలని తెలుగుదేశం పార్టీ శ్రేణుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ వినిపించింది. అప్పట్లో కొందరు నేతలు బహిరంగంగానే ప్రకటనలు చేసినప్పటికీ, పార్టీ అధిష్టానం జోక్యం చేసుకుని వారించడంతో ఆ చర్చ సద్దుమణిగింది. అయితే లోకేష్ సీఎం అనే చర్చ మళ్ళీ తెరపైకి రావడం వెనుక కేడర్‌లో ఉన్న ఉత్సాహమే ప్రధాన కారణం. యువగళం పాదయాత్ర ద్వారా తనను తాను నిరూపించుకున్న లోకేష్‌కు తగిన గుర్తింపు దక్కాలనేది అభిమానుల కోరిక. కానీ, పార్టీ క్రమశిక్షణ దృష్ట్యా ఇలాంటి కీలక అంశాలపై అధిష్టానం అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తోంది.చంద్రబాబు నాయుడు రాజకీయ ప్రస్థానంలో ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం అమరావతి నిర్మాణం. రాజధానిని ఒక కొలిక్కి తీసుకురావడమే తన జీవిత ఆశయమని ఆయన పలుమార్లు స్పష్టం చేశారు. ఈ భారీ ప్రాజెక్టు పూర్తి కావాలన్నా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిలో పడాలన్నా మరో పదేళ్ల సుదీర్ఘ కాలం పడుతుందనేది వాస్తవం. ఇటువంటి క్లిష్ట సమయంలో అనుభవజ్ఞుడైన చంద్రబాబు పగ్గాలు వదిలిపెడతారనేది కేవలం ఊహ మాత్రమే. అమరావతి స్వప్నం సాకారం కాకుండా ఆయన సీఎం పీఠం నుంచి తప్పుకునే అవకాశం లేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.చంద్రబాబు కేంద్ర రాజకీయాల్లోకి వెళ్తారని, అక్కడ కీలక పదవి చేపట్టి రాష్ట్రంలో లోకేష్‌కు బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. అయితే, చరిత్రను పరిశీలిస్తే చంద్రబాబు ఎప్పుడూ పదవుల కోసం పాకులాడలేదు. కింగ్ మేకర్‌గా తనకున్న లోక్ సభ ఎంపీల బలాన్ని ఎప్పుడూ రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఉపయోగించారు తప్ప, తన సొంత పదవుల కోసం వాడలేదు. 1990లలోనే ప్రధాని పదవినే కాదనుకున్న ఆయనకు, ఇప్పుడు కేంద్ర మంత్రి పదవులపై ఆసక్తి ఉంటుందనుకోవడం పొరపాటే అవుతుందని టీడీపీ వర్గాలంటున్నాయి నిజానికి టీడీపీలో చంద్రబాబు తర్వాత వారసుడిగా లోకేష్ నాయకత్వంపై ఎవరికీ సందేహాలు లేవు. కానీ అది ఎప్పుడు జరగాలి? ఎలా జరగాలి? అనేదానికి కాలమే సమాధానం చెబుతుంది. ప్రస్తుతం జరుగుతున్న చర్చలన్నీ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న గాసిప్స్ మాత్రమే. ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబు పాలనపైనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉంది కాబట్టి, లోకేష్ పట్టాభిషేకం అనే అంశం ప్రస్తుతానికి కార్యరూపం దాల్చడం అసాధ్యమని టీడీపీ వర్గాలు క్లారిటీ ఇస్తున్నాయి.

# కూటమిలో మిత్రుల మధ్యే పోటీ

ఏలూరు, మార్చి 3,ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగకముందే రాజకీయ వాతావరణం వేడెక్కింది. అయితే ఈసారి పోరు అధికార, ప్రతిపక్షాల మధ్య కంటే.. అధికార కూటమిలోని పార్టీల మధ్యే ఎక్కువగా ఉండేలా కనిపిస్తోంది. గత ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన వైసీపీ, ఈ ఎన్నికలను బహిష్కరించే యోచనలో ఉందన్న వార్తలు వినిపిస్తుండటంతో, ఇప్పుడు అందరి దృష్టి టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తుపైనే పడింది. పైన నేతలు చేతులు కలిపినా, కింద కేడర్ మనసులు కలవడమే ఇప్పుడు అసలైన సవాల్‌గా మారింది.కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ, ఈ సారి స్థానిక సంస్థల్లో సింహభాగం ఆశిస్తోంది. ఇటీవల రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వంటి నేతలు కోనసీమ లాంటి ప్రాంతాల్లో 80 శాతం స్థానాల్లో తామే పోటీ చేస్తామని బహిరంగంగా ప్రకటించడం కూటమిలో కలకలం రేపుతోంది. జనసేన బలంగా ఉన్న ఉమ్మడి గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఆ పార్టీ కేడర్ సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలను వదులుకోవడానికి సిద్ధంగా లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే మిత్రపక్షాల మధ్య ఫ్రెండ్లీ కాంటెస్ట్ పేరుతో అంతర్గత పోరు తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారుదశాబ్దాలుగా గ్రామస్థాయిలో బలమైన వ్యవస్థ ఉన్న తెలుగుదేశం పార్టీకి, స్థానిక ఎన్నికలు చావో రేవో లాంటివి. తమ గ్రామంలో పట్టు కోల్పోవడానికి ఏ నాయకుడూ ఇష్టపడడు. సీట్ల సర్దుబాటులో భాగంగా తమకు పట్టున్న గ్రామాలను మిత్రపక్షాలకు కేటాయిస్తే, టీడీపీ కేడర్ తిరుగుబాటు చేసే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పైస్థాయిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మధ్య ఉన్న సఖ్యత క్షేత్రస్థాయిలో ఓటర్ల బదిలీకి ఎంతవరకు ఉపయోగపడుతుందనేది అసలు ప్రశ్న.జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికలకు వెళ్లడం కంటే బహిష్కరణ అస్త్రాన్ని ప్రయోగించడం ద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకతను ప్రదర్శించాలని భావిస్తోంది. ఒకవేళ వైసీపీ బరిలో లేకపోతే, కూటమిలోని పార్టీలు ఒకరితో ఒకరు పోటీ పడటం ఖాయం. ప్రత్యర్థి లేని పోరాటంలో మిత్రపక్షాల మధ్య వైషమ్యాలు పెరిగి, అది ప్రభుత్వంపై ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కేవలం ఎమ్మెల్యేల స్థాయిలో కాకుండా, గ్రామ స్థాయిలో కమిటీలు వేసి సీట్ల సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. గతంలో ఎక్కడ ఎవరు బలంగా ఉన్నారో వారికే కేటాయించడం. నియోజకవర్గ స్థాయిలోనే మూడు పార్టీల నేతలతో కమిటీలు వేసి వివాదాలు పరిష్కరించడం. స్థానిక సమస్యలపై కూటమి తరపున ఒకే అజెండాతో ప్రజల్లోకి వెళ్లడం వంటివి చేయాల్సి ఉంది. కూటమి నాయకత్వం ఈ చిక్కుముళ్లను విడదీయకపోతే, స్థానిక ఎన్నికలు మిత్రపక్షాల మధ్య విద్వేషాలకు దారితీసే ప్రమాదం ఉంది. అధికారాన్ని పంచుకోవడంలో చూపిన పరిణతిని, క్షేత్రస్థాయిలో సీట్ల పంపకంలో కూడా చూపిస్తేనే కూటమి ప్రయోగం విజయవంతమవుతుంది. లేనిపక్షంలో, ప్రత్యర్థి లేకపోయినా సొంత పార్టీల కుమ్ములాటలే కూటమికి అతిపెద్ద శత్రువులుగా మారతాయి.

# ఏపీ పేరు మార్పు రచ్చ...

కాకినాడ, మార్చి 3, ఇటీవల కేంద్ర ప్రభుత్వం కేరళ రాష్ట్రం పేరును మార్చిన సంగతి తెలిసిందే. అక్కడి ప్రజల కోరిక మేరకు కేరళం అని పేరు మార్చారు. దీంతో ఆంధ్ర ప్రదేశ్ పేరును కూడా మార్చాలని డిమాండ్ మొదలైంది. గతంలో ఆంధ్ర రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ గా అవతరించింది. తరువాత తెలుగు నాడుగా మార్చాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. అయితే ఇప్పుడు కేరళ పేరు మార్పుతో తెలుగు నాడుగా ఏపీని మార్చాలన్న వాదన వినిపిస్తోంది. అయితే ఎట్టి పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ పేరు మార్పును ఊరుకోమని మరో వర్గం హెచ్చరిస్తోంది. అయితే తాజాగా ఈ తేనె తుట్టను కదిపారు ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు. గతంలో ఎన్టీ రామారావు ఉమ్మడి ఏపీ ని తెలుగు నాడుగా మార్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ప్రముఖ ప్రవచన కర్తగా ఉన్నారు గరికపాటి నరసింహారావు ఆధ్యాత్మికతతో పాటు చరిత్రను గుర్తుచేస్తూ ప్రవచనాలు చెబుతుంటారు. ఈ నేపథ్యంలో గతంలో ఏపీని తెలుగు నాడుగా మార్చేందుకు ఎన్టీఆర్ చేసిన ప్రయత్నాన్ని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ అనేది తెలుగు పదం కాదని.. ఆంధ్రప్రదేశ్ పేరులో తెలుగుదనం లేదు అని తేల్చేశారు.

కేరళ వారికి ఉన్న పట్టుదల కూడా మనకు లేదని.. కేరళ ను కేరళంగా మార్చినట్టే.. ఆంధ్రప్రదేశ్ పేరును తెలుగు నాడుగా మార్చాలని గరికపాటి కోరారు. దీంతో ఆంధ్ర ప్రదేశ్ పేరు మార్పు పై చర్చ మొదలైంది.

ఇదే అంశంపై భువనేశ్వరి పీఠాధిపతి స్వామి కమలానంద భారతి స్పందించారు. ఈ కొత్త చర్చ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ అంటే తెలుగు కాదా? రామాయణ కాలం నుంచి ఆంధ్రా అనే పదం ఉందంటూ ఆయన గరికపాటికి కౌంటర్ ఇచ్చారు. అడిగేవాళ్లు లేరని అధిక ప్రసంగాలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. అంతటితో ఆగకుండా వింత పోకడలు, ఇంత ఆలోచనలు మంచిది కాదని.. తెలుగు నాడు అని మార్చినా ఎటువంటి సెంటిమెంటు ఉండదని.. ఇలాంటి మేధావులే ఏపీకి మద్రాస్ రాకుండా చేశారని విమర్శించారు. గరికపాటి తెలంగాణలో స్థిరపడ్డారని.. మా బ్రతుకులు ఎలా ఉండాలో మాకు తెలుసు అంటూ చురకలు అంటించారు. ఆంధ్రప్రదేశ్ పేరును తెలుగునాడుగా మార్చాలనే ఆలోచన ఇప్పటిది కాదు. దీనికి దశాబ్దాల చరిత్ర ఉంది. 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పుడు ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవం అనే నినాదాన్ని ఎత్తుకున్నారు. ఆయన హయాంలోనే రాష్ట్రాన్ని తెలుగునాడుగా మార్చాలనే బలమైన ప్రతిపాదన వచ్చింది. అసెంబ్లీలో కూడా దీనిపై చర్చలు జరిగాయి. కానీ అప్పట్లో రాజకీయ పరిణామాలు, రాజ్యాంగపరమైన ఇబ్బందుల వల్ల అది కార్యరూపం దాల్చలేదు.ఇప్పుడు వీరి మధ్య జరిగిన వ్యాఖ్యలు కలకలం రేపాయి.మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయి 1953లో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. అప్పట్లో దీనిని ఆంధ్ర అని మాత్రమే పిలిచేవారు. 1956లో హైదరాబాద్ రాష్ట్రంలోని తెలుగు ప్రాంతాలు కలిసిన తర్వాత, ఉమ్మడి రాష్ట్రానికి ఆంధ్రప్రదేశ్ అని పేరు పెట్టారు. అప్పుడే కొందరు మేధావులు తెలుగునాడు పేరును సూచించినా, ఆనాడు ఆంధ్ర అనే పదానికే మొగ్గు చూపారు. 1969లో మద్రాసు రాష్ట్రం తమిళనాడుగా మారింది. ఇటీవలే ఒరిస్సా ఒడిశాగా, పాండిచ్చేరి పుదుచ్చేరిగా మారాయి. ఇప్పుడు కేరళను కేరళంగా మార్చాలని ఆ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసింది.

ఈ క్రమంలోనే గరికపాటి వంటి వారు తెలుగు అస్తిత్వం కోసం పేరు మార్పును సమర్థిస్తున్నారు.భాషా పరంగా ఆంధ్ర అనేది ఒక జాతిని సూచించే పదం కాగా, తెలుగు అనేది భాషను సూచిస్తుంది. గరికపాటి వాదన ప్రకారం భాషా ప్రయుక్త రాష్ట్రంలో భాష పేరు ఉండాలి. చారిత్రక పరంగా చూస్తే శాతవాహనులను ఆంధ్రులు అని పురాణాలు పేర్కొన్నాయి. దాదాపు 2000 ఏళ్ల చరిత్ర ఈ పదానికి ఉంది. అందుకే దీనిని మార్చడం అంటే చరిత్రను చెరపడమే అని కమలానంద భారతి వంటి పండితుల వాదన. ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్రం పేరు మార్చాలంటే అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి. అనంతరం పార్లమెంటు ఆమోదంతో రాష్ట్రపతి సంతకం చేయాల్సి ఉంటుంది.ఆంధ్రప్రదేశ్ పేరు మార్పు అనేది కేవలం భావోద్వేగపూరితమైన అంశం మాత్రమే కాదు, అది తెలుగు వారి అస్తిత్వానికి సంబంధించిన చర్చ. ఒకవైపు పురాణ కాలం నాటి ఆంధ్ర పదాన్ని గౌరవించే వారు, మరోవైపు భాషా గుర్తింపు కోసం తెలుగునాడు కావాలనే వారు ? ఈ ఇద్దరి మధ్య జరుగుతున్న ఈ పోరు ప్రస్తుతం ఏపీ రాజకీయ, సాంస్కృతిక వర్గాల్లో కాక రేపుతోంది. ప్రభుత్వం ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

# టమాట రైతుల ఆవేదన

విజయనగరం, మార్చి 3, అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి అన్నట్టు ఉంది ఏపీలో టమాటా రైతుల వ్యవహారం. పంట గిట్టుబాటు అయినప్పుడు మద్దతు ధర ఉండదు. మద్దతు ధర ఉన్నప్పుడు పంట పండదు. వాతావరణ ప్రతికూల పరిస్థితులు, చీడపీడలు వెరసి రైతు పండిస్తున్న టమాటాకు సరైన గిట్టుబాటు దక్కడం లేదు. ఇప్పుడు టమాటా పరిస్థితి చూస్తుంటే.. పండించిన రైతు దుస్థితి చూస్తుంటే ప్రతి ఒక్కరికి గుండె తరుక్కుపోతుంది. పంట లేనప్పుడు కిలో 100 రూపాయలు ఉండే టమాటా ధర ప్రస్తుతం రెండు రూపాయలకు పడిపోయింది. కప్పు టీ కి నాలుగో వంతు అన్నమాట. పండించిన పాపానికి టమాటా పారేయలేక.. అమ్ముకోలేక అన్నదాత పడే బాధ అంతా కాదు. నెలరోజుల వ్యవధిలోనే టమాటా రైతు పరిస్థితి తలకిందులైంది.టమాటా పంటకు పెట్టింది పేరు మదనపల్లి. చిత్తూరు జిల్లాలో చాలా ప్రాంతాల్లో టమాటాను ఎక్కువగా పండిస్తారు. అలాగే ఉత్తరాంధ్రలోని విజయనగరం జిల్లాలో సైతం ఈ ఏడాది రికార్డు స్థాయిలో పండించారు. అతి పెద్ద మార్కెట్ గా ఉన్న రామభద్రపురంలో ధర లేక టమాటా రైతులు బేల చూపులు చూస్తున్నారు. అయితే గత అనుభవాల దృష్ట్యా ఈసారి టమాటా పంటను అధికంగా వేశారు. గతంలో నష్టాలు అధికంగా రావడంతో.. వాటిని భర్తీ చేసేందుకు గాను ఈసారి పంటను ఎక్కువగా వేసుకున్నారు. దిగుబడి కూడా భారీగా వచ్చింది. ఎకరాకు 15 టన్నుల పంట వస్తుందని అంచనా వేస్తే.. ఏకంగా 20 టన్నుల దిగుబడి రావడం విశేషం. అయితే ఈ దిగుబడిని సాకుగా చూపి తక్కువ ధరకు అడుగుతున్నారు వ్యాపారులు. దీంతో రైతులకు ఏం చేయాలో తెలియడం లేదు.ఆరుగాలం కష్టపడి రైతులు పంటను పండించుకున్నారు. ఎక్కడ సాగుకు మందులు, ఎరువులు, కూలీల ఖర్చు కలిపి సుమారు 50 వేలు వరకు ఖర్చు పెట్టారు. కానీ ప్రస్తుత టమాటా ధరలు చూస్తుంటే కనీసం 20వేల రూపాయల కూడా రాని దుస్థితి. దీంతో తనకు తీవ్ర నష్టం తప్పదని రైతులు వాపోతున్నారు. కనీసం మార్కెట్ వరకు తీసుకురావడానికి అయ్యే రవాణా ఖర్చులు కూడా దొరకడం లేదు. ఆ రెండు రూపాయల కూడా మిగిలే పరిస్థితి లేదు. దీంతో పంటను కోయలేక రైతులు పొలాల్లోనే వాటిని విడిచిపెట్టారు. కొందరైతే పొలాల్లోనే కుప్పలుగా పోస్తూ వదిలేశారు. విజయనగరం జిల్లా రామభద్రపురం మార్కెట్లో రోజంతా నిరీక్షించినా టమాటా గురించి అడిగే నాథుడే కరువయ్యారని రైతులు చెబుతున్నారు. అయితే ఈ సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

# పంచముఖి ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

సికింద్రాబాద్ తెలంగాణలోని ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. సోమవారం మొండా మార్కెట్ పంచముఖి హనుమాన్ ఆలయ పునర్నిర్మాణ పనుల ప్రారంభం నేపథ్యంలో ఆలయ చైర్మన్, స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజ చేశారు. ఈ సందర్భంగా వారికి వేదపండితులు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆలయాల అభివృద్ధికి పూర్వ వైభవం తీసుకొస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే అన్ని ఆలయాలను కోట్ల రూపాయలతో అద్భుత క్షేత్రాలుగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో భక్తులు స్వచ్ఛందంగా విరాళాలతో పునర్నిర్మాణం చేసుకోవడం అభినందనీయమన్నారు. రాజకీయాలకతీతంగా భక్తులంతా కలసికట్టుగా ఆలయాన్ని పునర్నిర్మించుకోవడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో దేవాలయాలను అభివృద్ధి చేసే క్రమంలో బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని ఆలయాలను అభివృద్ధి చేయనున్నట్టు పేర్కొన్నారు.

# ఆదానీ ప్రాజెక్టుకు కండిషన్స్ అప్లై

విజయవాడ, మార్చి 3, ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్నాళ్లుగా రాజకీయ దుమారం రేపుతున్న అదానీ సోలార్ పవర్ ఒప్పందంపై చంద్రబాబు ప్రభుత్వం ఒక కీలకమైన, వ్యూహాత్మకమైన నిర్ణయం తీసుకుంది. గత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో కుదుర్చుకున్న ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన తెలుగుదేశం పార్టీ, ఇప్పుడు కొన్ని కీలకమైన నిబంధనలు విధిస్తూ డీల్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధమైంది.తాజా సమాచారం ప్రకారం, చంద్రబాబు ప్రభుత్వం 7,000 మెగావాట్ల పూర్తి స్థాయి ఒప్పందాన్ని కాకుండా, కేవలం 300 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు మాత్రమే ప్రస్తుతానికి అనుమతినిచ్చింది. ఇది ఒకరకంగా అదానీ గ్రూప్‌కు, సెకీ కి షాక్ ఇచ్చే నిర్ణయమే. ఫిబ్రవరి 26న ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ప్రస్తుతానికి ఈ పరిమిత స్థాయి కొనుగోలు ద్వారా డీల్‌ను ఆపరేషనల్ మోడ్‌లోకి తెచ్చారు.ఈ ఒప్పందంలో ఏపీ ప్రభుత్వం విధించిన అతి పెద్ద నిబంధన ఏమిటంటే.. అంతర్రాష్ట్ర విద్యుత్ సరఫరా ఛార్జీలు, నష్టాలను రాష్ట్ర ప్రభుత్వం భరించదు. డెలివరీ పాయింట్ వరకు అయ్యే ఈ అదనపు ఖర్చులను సెకీ (SECI) భరించాలని ఏపీ స్పష్టం చేసింది. దీనివల్ల వాణిజ్యపరమైన రిస్క్ అంతా ఇప్పుడు సెకీ మీదే పడనుంది. ఒకవేళ సెకీ దీనికి అంగీకరిస్తేనే ఒప్పందం పూర్తి స్థాయిలో ముందుకు సాగుతుంది.గౌతమ్ అదానీ అప్పట్లో జగన్ మోహన్ రెడ్డిని కలిసిన తర్వాతే ఈ డీల్ కుదిరిందని, ఇందులో సుమారు రూ. 1,750 కోట్ల ముడుపులు చేతులు మారాయని అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణల నేపథ్యంలోనే చంద్రబాబు ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని రద్దు చేసే అంశంపై తీవ్రంగా మల్లగుల్లాలు పడింది. అయితే, ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేస్తే చట్టపరమైన చిక్కులు, భారీ జరిమానాలు పడే అవకాశం ఉండటంతో, ప్రభుత్వం ఈ 'మధ్యేమార్గం' ఎంచుకున్నట్లు కనిపిస్తోంది.నాడు ఈ డీల్‌ను పెద్ద స్కామ్ అని తిట్టిన టీడీపీ, ఇప్పుడు అదే డీల్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పిస్తోంది. "అప్పుడు లంచాలు అన్నారు కదా, మరి ఇప్పుడు ఏ ప్రాతిపదికన ఓకే చేశారు?" అని వైసీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. దీనికి సమాధానంగా.. తాము ఒప్పందాన్ని గుడ్డిగా అంగీకరించలేదని, రాష్ట్ర ప్రయోజనాల కోసం కఠినమైన షరతులు విధించామని టీడీపీ సమర్థించుకుంటోంది.చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం వెనుక లోతైన రాజకీయ, ఆర్థిక వ్యూహం ఉంది. ట్రాన్స్‌మిషన్ ఛార్జీలను సెకీ మీదకు నెట్టడం ద్వారా రాష్ట్ర ఖజానాపై పడే అదనపు భారాన్ని తగ్గించారు. అదానీపై ఉన్న ముడుపుల ఆరోపణల నేపథ్యంలో డీల్‌ను పూర్తిగా అంగీకరించకుండా, పరిమిత స్థాయికి తగ్గించడం ద్వారా విమర్శల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశారు. డీల్‌ను రద్దు చేసి ఉంటే అంతర్జాతీయ పెట్టుబడిదారుల్లో రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతినే అవకాశం ఉండేది. అది జరగకుండా జాగ్రత్త పడ్డారు.మొత్తానికి, అదానీ పవర్ డీల్ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వం వేచి చూసే ధోరణిని అవలంబిస్తూనే, బంతిని సెకీ, అదానీ కోర్టులోకి నెట్టేసింది. ఈ షరతులకు అదానీ గ్రూప్, కేంద్ర సంస్థ సెకీ ఎలా స్పందిస్తాయనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది.

# త్రిశూల్ వ్యూహంతో అమెరికా ఇజ్రాయిల్

న్యూఢిల్లీ, మార్చి 3, యుద్ధం అంటే గగనతలంలో గర్జించే జెట్లు, నేలపై పేలే బాంబులు అనుకుంటాం. కానీ ఈసారి కథ అక్కడి నుంచి మొదలుకాలేదు. ఇరాన్‌పై దాడి చేయాలనుకున్న ఇజ్రాయెల్-అమెరికా అద్భుతమైన స్కెచ్ వేశాయి. బాంబర్లు, జెట్లు ఇలా దాడిచేస్తే.. ఇరాన్ ఎయిర్‌డిఫెన్స్ సిస్టమ్ వారిని అడ్డుకుంటుందని తెలుసు. ఇందుకోసం మూడంచెల వ్యూహాన్ని అమలు చేశాయి. అసలు యుద్ధం మొదలైంది ఆకాశంలో కాదు... రాడార్ స్క్రీన్‌లపైనే.. ఇజ్రాయెల్-అమెరికా చేపట్టిన సైబర్, డెకాయ్, ఎయిర్ అటాక్‌లకు ఇరాన్ బిత్తరపోయింది. ఆధునిక వార్‌ఫేర్ ఏలా మారిపోతోందో ఈ అటాక్ కళ్లకు కట్టింది. ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ఎందుకు పనిచేయలేకపోయింది? సూటిగా చెప్పాలంటే ? ప్రత్యర్థి సాంకేతిక సామర్థ్యం పూర్తిగా ఇరాన్‌కు అందనంత స్థాయిలో ఉంది. ఇరాన్ ఎయిర్ డిఫెన్స్‌ను ఛేధించడం కోసం యుఎస్ సైబర్ వార్‌ఫేర్‌ను ఉపయోగించింది. ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, సైబర్ ఆపరేషన్లు కలిసి రాడార్‌లలోకి నకిలీ డేటాను పంపించాయి. అంటే పదుల సంఖ్యలో యుద్ధ విమానాలు ఇరాన్ వైపు దూసుకొస్తున్నట్లుగా స్క్రీన్‌పై కనిపిస్తుంది.కానీ అవన్నీ వాస్తవాలు కావు. ఇరాన్‌లోని స్వదేశీ బావర్ వ్యవస్థలైనా, రష్యా నుంచి వచ్చిన ఎస్-300, ఎస్-400 బ్యాటరీలైనా ? ఒకేసారి వచ్చిన డిజిటల్ దాడిని తట్టుకోలేకపోయాయి. రాడార్ ఆపరేటర్‌కు ఏది నిజం? ఏది మోసం? అర్థం కాని పరిస్థితి.ఇదే సమయంలో వందల సంఖ్యలో డీకాయ్ డ్రోన్లు ప్రయోగించారు. ఇవి చిన్నవే. కానీ రాడార్‌కు మాత్రం ఎఫ్-15లు, ఎఫ్-16ల పెద్ద స్క్వాడ్రన్‌లా కనిపిస్తాయి. టెహ్రాన్ వైపు భారీ దళం దూసుకొస్తున్నట్టే సిగ్నల్ వస్తుంది. ఇక ఎయిర్‌డిఫెన్స్ సిస్టమ్ పూర్తిగా వాళ్ల వెంట పడుతుంది. డెకాయి డ్రోన్లను డీల్ చేయడంలో ఇరాన్ ఎయిర్‌డిఫెన్స్ సిస్టమ్ బిజీగా ఉన్న సమయంలోనే ఎఫ్-35, ఎఫ్-22లు ఇరాన్ భూభాగంపైకి వెళ్లాయి. అసలేం జరుగుతుందో ఇరాన్‌కు అర్థమయ్యే లోపు వారి రక్షణ ముఖద్వారం బద్ధలైపోయింది.

మొదటి దశ: టెహ్రాన్, ఇలామ్, ఖుజెస్టాన్ ప్రాంతాల్లోని సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ సైట్లు, రాడార్ స్టేషన్లు, గాలి రక్షణ హెడ్‌క్వార్టర్స్‌ను టార్గెట్ చేశారు.

రెండో దశ: బ్యాలిస్టిక్ మిస్సైల్ లాంచర్లు, నిల్వ కేంద్రాలపై దాడులు.

మూడో దశ: సైనిక తయారీ పరిశ్రమలపై దృష్టి. దీర్ఘకాల యుద్ధ సామర్థ్యాన్ని బలహీనపరచడం లక్ష్యం.

ఇక అసలైన భౌతిక దాడి సముద్రంపై నుంచి మొదలైంది. ఇరాన్‌కు దగ్గరలో ఉన్న అమెరికన్ మిస్సైల్స్ పైకి లేచాయి. ఇవి శత్రు రాడార్‌లకు దొరక్కుండా చాలా తక్కువ ఎత్తులో దూసుకెళ్లాయి.అంతకుముందే ఎఫ్-35, ఎఫ్-22 రాప్టర్లు వెళ్లడంతో అప్పటికే రాడార్‌లపై తప్పుడు లక్ష్యాలు, ఎలక్ట్రానిక్ జ్యామింగ్ ? ఈ కలయికతో ఎయిర్ డిఫెన్స్ నెట్‌వర్క్ విచ్ఛిన్నం అయింది. ఆ సమయంలో చాలా తక్కువ ఎత్తులో వచ్చి టామ్‌హాక్స్ ఎస్-300,ఎస్-400 రాడార్ సైట్లు, కమాండ్ బంకర్లపై దాడి చేశాయి. సో.. శత్రుదేశాల ఎటాక్స్‌ను డేగకళ్లతో పర్యవేక్షించే డిఫెన్స్ సిస్టమ్‌కు కళ్లే లేకుండా పోయాయి. ఇరాన్ గగనతలంపైకి తమ ఫైటర్‌జెట్లు దూసుకువెళ్లేలా సేఫ్ కారిడార్‌ను విజయవంతంగా సృష్టించిన తర్వాత అసలు కథ మొదలైంది.

ఎయిర్‌డిఫెన్స్, మిలటరీ స్థావరాలను ధ్వంసం చేశాక.. ఇక మిగిలిన లక్ష్యాలను ఛేధించడానికి బాంబర్స్ వచ్చేశాయి. అవి ఒకేసారి జెడామ్ బాంబులు, మిస్సైళ్లను తీసుకెళ్లగలవు. ఇందుకోసం ః-2 స్పిరిట్ స్టెల్త్ బాంబర్లను తెచ్చారు. ఇవి భూమి మీదనే కాదు.. భూమిలోపల ఉండే బంకర్లను కూడా ధ్వంసం చేయగలుగుతాయి. అదే సమయంలో జోర్డాన్, యూఏఈ లోని అమెరికన్ బేస్‌ల నుంచి.. ఎఫ్-15ఇ స్ట్రయిక్ ఈగల్స్ దూసుకొచ్చాయి. ఒక్కో జెట్ 19 జెడామ్ లు లేదా 28 చిన్న దయామీటర్ బాంబులు మోసుకెళ్లగలదు. ఇవి ప్రధానంగా మూవింగ్ టార్గెట్స్ ను ఛేధిస్తాయి. అంటే వాహనాలపై నుంచి ప్రయోగించే సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్స్ సిస్టమ్‌ను గుర్తించి దానని ధ్వంసం చేస్తుందన్నమాట.. లోయల్లో దాగి ఉన్న మొబైల్ మిస్సైల్ లాంచర్లు, కమాండ్ సెంటర్లపై దాడులు జరిపాయి.ఎంతగా ప్లాన్ చేశారు అంటే ఒకసారి దాడి చేసిన తర్వాత ఇవి తిరిగి వెళ్లవు. మళ్లీ దాడి చేయడానికి వీలుగా వీటికి ఆకాశంలోనే ఇంధనాన్ని నింపే కూడా చేశారు. అందుకే ఇంధనాన్ని నింపుకుని వచ్చి మళ్లీ మళ్లీ దాడులు చేశాయి. ఇజ్రాయెల్, యుఎస్ అంత కచ్చితమైన స్కెచ్ వేశాయి. ఓ పక్క వైమానిక దళం డిస్ట్రక్షన్ చేసేస్తుంటే.. దానికి సపోర్ట్‌గా యూ ఎస్ నేవీ రంగంలోకి వచ్చింది. రెండు గంటల తర్వాత జూ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌లు అరేబియా సముద్రం నుంచి ఆపరేషన్ మొదలుపెట్టింది. దూరంగా ఉన్న అమెరికాను ఏం చేయలేక యుఎస్ మిత్రదేశాలపై దాడులు మొదలు పెట్టింది. యూఏఈలోని ఎయిర్ బేస్ పై దాడి చేశారు. బహ్రెయిన్‌లోని యూఎస్ నేవీ ఫిఫ్త్ ఫ్లీట్ ప్రధాన కార్యాలయాన్ని కూడా టార్గెట్ చేశారు. సోమవారం సాయంత్రానికి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కార్యాలయంపై కూడా దాడి చేసినట్లు ఇరాన్ ప్రకటించింది.డికాయ్ ఆపరేషన్స్, సైబర్ ఎటాక్, వంటివి ఫ్యూచర్ వార్‌ఫేర్‌లో ఏ రీతిలో ప్రాధాన్యం వహిస్తున్నాయో ఈ ఆపరేషన్ చెబుతోంది.

## అమరావతిలో హైకోర్టు జస్టిస్ బంగ్లాలు

విజయవాడ, మార్చి 3, అమరావతి రాజధాని ప్రాంతంలోని గవర్నమెంట్ కాంప్లెక్స్ లోని సూపర్ బ్లాక్ కె ఎఫ్ ప్రాంతంలో ఈ జస్టిస్ బంగ్లాను నిర్మించారు. ప్రతి బంగ్లా దాదాపు 2019 గజాల విస్తీర్ణంలో మొత్తం 775 చదరపు అడుగుల నిర్మాణంతో విస్తృతంగా రూపొందించారు. అన్ని బంగ్లాలు ఒకే వరుసలో చక్కని ప్రణాళికతో నిర్మించారు. అయితే ఇటీవలే భారత ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. న్యాయమూర్తుల హోదాకు తగినట్టుగా ఈ నివాసాల్లో అన్ని అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ప్రతి బంగ్లాను గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ గా నిర్మించారు. విశాలమైన హాల్, బెడ్ రూమ్స్ నూతన టెక్నాలజీ వసతులతో ఈ బిల్డింగులు సిద్ధమయ్యాయి.జస్టిస్ బంగ్లా మధ్యలో సుమారు 1.5 ఎకరాల విస్తీర్ణంలో ఒక పెద్ద సెంట్రల్ పార్కును అభివృద్ధి చేస్తున్నారు. పిల్లలు ఆడుకునేందుకు స్థలం, పెద్దల కోసం జిమ్ ఏరియా నరకమార్గాలు ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. చుట్టూ పచ్చదనంతో ప్రశాంత వాతావరణ ఉండేలా ఈ పార్కును ప్లాన్ చేశారు. జస్టిస్ అవసరాల కోసం ప్రత్యేకంగా క్లబ్ హౌస్, గెస్ట్ హౌస్ నిర్మాణానికి కూడా పునాది వేశారు. ఇది సుమారు 6300 గజాల స్థలంలో 50వేల చదరపు అడుగుల విస్తీర్ణతో మూడు అంతస్తులో నిర్మిస్తున్నారు.ఇక పిచ్చుకల పాలెం ప్రాంతంలో జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణం కూడా వేగంగా కొనసాగుతుంది. సుమారు 4.83 ఎకరాల విస్తీర్ణలు ఈ అకాడమీ నిర్మిస్తున్నారు. ఇక్కడ 500 మంది కూర్చోనే ఆడిటోరియం, క్లాస్ రూమ్స్, సెమినార్ హాళ్లు, మూడ్ కోర్టు హాల్, లైబ్రరీ ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఎనిమిది అంతస్తుల హాస్టల్ భవనం కూడా నిర్మిస్తున్నారు. జస్టిస్ సిటీ ప్రాంతం.. ఔ1,ఔ2, ఇ5, ఇ6 రోడ్ల మధ్యలో ఉంది. సీడ్ ఆక్సిస్ రోడ్ నుంచి ఈ ప్రాంతానికి చేరుకునేలా 2.5 కిలోమీటర్ల కొత్త తారు రోడ్లు వేశారు. లోపల 12 మీటర్ల వెడల్పుతో అంతర్గత రోడ్లు ఏర్పాటు చేశారు. మొత్తంగా చూస్తే ఒకప్పుడు గ్రాఫిక్స్ అని విమర్శించిన అమరావతి ఇప్పుడు నిజమైన కట్టడాలతో తన ఉనికిని చాటుకుంటుంది. జస్టిస్ సిటీలో జస్టిస్ బంగ్లాల ప్రారంభం రాజధాని అభివృద్ధిలో మరో కీలక ముందడుగుగా మారింది.

## రుషికొండ బీచ్ రోడ్డులో ట్రావెల్స్ బస్సు దగ్ధం

విశాఖపట్నం రుషికొండ సమీపంలోని బీచ్ రోడ్డులో వెళ్తున్న ఓ ట్రావెల్స్ బస్సు అకస్మాత్తుగా షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటల్లో చిక్కుకుంది. క్షణాల్లోనే మంటలు బస్సు మొత్తం వ్యాపించడంతో అక్కడ భయాందోళన వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే పనిలో పడ్డారు. ప్రయాణికులు సురక్షితంగా బయటపడినట్లు ప్రాథమిక సమాచారం.
ఆస్తి నష్టం ఎంత? బస్సులో ఎంతమంది ఉన్నారు? షార్ట్ సర్క్యూట్నే అసలు కారణమా? అనే అంశాలపై అధికారులు విచారణ చేపడుతున్నారు.

## ఇరాన్ పార్లమెంట్పై ఇజ్రాయెల్ దాడి

న్యూఢిల్లీ ఇరాన్?ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న యుద్ధం మరింత ఉధృతమైంది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ పార్లమెంట్ భవనం లక్ష్యంగా మారినట్లు సమాచారం. దీనికి ప్రతిగా ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడులతో జోర్డాన్, కువైట్, ఇజ్రాయెల్లోని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని దాడులకు తెగబడింది. ఇక రియాద్లోని అమెరికా ఎంబసీపై కూడా ఇరాన్ దాడి చేసింది. ఈ పరిణామాలతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి.

# గల్ఫ్ దేశాల్లో ఇండియన్స్ కోసం భారత్ వ్యూహాలు

న్యూఢిల్లీ, మార్చి 3, (న్యూస్ పల్స్) ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేయడంతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావణం నెలకొంది. దీంతో గల్ఫ్ దేశాల్లో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. వాళ్ల చదువులకు ఆటంకం ఏర్పడటమే కాకా భద్రతాపరంగా ముప్పును ఎదుర్కొంటున్నారు. 2025 నాటి గణాంకాల ప్రకారం 150 దేశాల్లోని యూనివర్సిటీలు, స్కూళ్లలో మొత్తంగా 18.80 లక్షల మంది భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారు. వీళ్లలో పశ్చిమాసియాలోనే దాదాపు 5 లక్షల మంది ఇండియన్ స్టూడెంట్స్ ఉన్నారు. ఈ ప్రాంతంలో దాదాపు లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. దీంతో ఇక్కడ భారతీయులకు అనుగుణంగా ఉండే సిలబస్‌నే బోధిస్తారు. అందుకే భారతీయ విద్యార్థులు ఇక్కడ చదవుకునేందుకు ప్రాధాన్యం చూపిస్తారుకేంద్ర గణాంకాల ప్రకారం చూసుకుంటే జంఇలో అత్యధికంగా 2,53,832 మంది భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారు. తర్వాతి స్థానాల్లో సౌదీ అరేబియా (75,830), కువైట్(50,000), ఖతార్(49,346), ఒమన్ (44,847), బహ్రెయిన్ (28,620), ఇజ్రాయెల్(900) దేశాలు ఉన్నాయి. దాదాపు 5 లక్షల మంది భారతీయ విద్యార్థులు ఈ దేశాల్లో చదువుకుంటున్నారు. అక్కడ మార్చి 2న 10వ తరగతి, 12వ తరగతి సీబీఎస్ఈ బోర్డు పరీక్షలు జరగాల్సి ఉంది. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వాటిని కూడా వాయిదా వేశారు. మరోవైపు ఉపాధి కోసం పశ్చిమాసియాకు వచ్చిన భారతీయుల సంఖ్య దాదాపు 80 లక్షలు ఉంటుంది

# యాదాద్రి ఆలయం మూసివేత

యాదాద్రి చంద్రగ్రహణం సందర్భంగా యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ ద్వారాలు మూసివేసారు. మంగళవారం ఉదయం 7 గంటల నుండి మరుసటి రోజు 8.45 ని. వరకు భక్తులకు దర్శనాలు నిలిపివేసారు. మంగళవారం మధ్యాహ్నం3.30 నిమిషాల నుండి సాయంత్రం 6:47 చంద్రగ్రహణం వున్న నేపథ్యంలో మార్చి 4 న ఉదయం 3.30 కు యాదాద్రి ఆలయ ప్రధాన ద్వారాలు తెరుచుకోనున్నాయి. ఆలయ శుద్ధి సంప్రోక్షణ కార్యక్రమం తరువాత ఉదయనీ 8.45 ని నుండి భక్తులకు సర్వ దర్శనాల పునరుద్ధరణ వుంటుంది.

# పిల్లలను చంపి తల్లి సూసైడ్





యాదాద్రి భువనగిరి ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య చేసుకుంది. బీబీనగర్ మండలం గొల్లగూడెంలో తెల్లవారుజామున ఘోరం జరిగింది. వివాహిత తన ఇద్దరు పిల్లలను చంపి, అనంతరం తాను ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనతో గ్రామస్థులు ఒక్కసారిగాగ్భ్రాంతికి గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబ కలహాలే కారణమా లేక మరేదైనా సమస్య ఉందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అక్రమ రవాణా అవుతున్న రేషన్ బియ్యం పట్టివేత



ఏలూరు రూరల్ మండలం, తంగెళ్ల మూడి పంచాయతి పరిధి లో రత్నాస్ దాభా బిల్డింగ్ అశోక్ లైలాండ్ 14 చక్రాల లారీ ఆపి విజిలెన్సు, రెవిన్యూ, పౌర సరఫరా అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసారు. లారీలో 25.80 టన్నులు రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుచున్నట్లుగా గుర్తించారు. బియ్యను స్వాధీనం చేసుకున్నారు.

# సనత్‌నగర్ టిమ్స్‌లో 'న్యూమాటిక్ ట్యూబ్ సిస్టమ్

హైదరాబాద్, మార్చి 3, తెలంగాణ ప్రభుత్వం సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. 1000 పడకల సామర్థ్యంతో ఈ హాస్పిటల్ నిర్మిస్తుండగా.. ఉగాది నాటికి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక టిమ్స్‌లో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురానున్నారు. పేషెంట్లకు సత్వర వైద్యం అందించేందుకు న్యూమాటిక్ ట్యూబ్ సిస్టమ్‌కు ఏర్పాటు చేస్తున్నారు. ఓ గవర్నమెంట్ హాస్పిటల్‌లో ఇటువంటి టెక్నాలజీ తీసుకురావటం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి.తెలంగాణలోని నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందించే లక్ష్యంతో హైదరాబాద్ సనత్‌నగర్‌లో ప్రభుత్వం తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్ నిర్మిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ హాస్పిటల్ ప్రారంభానికి ఇటీవల ముహూర్తం కూడా ఖరారు చేశారు. ఉగాది పండుగ రోజున అంటే మార్చి 19న ఈ ప్రతిష్టాత్మక 1000 పడకల ఆసుపత్రిని ప్రారంభించి ప్రజలకు అంకితం చేయాలని ప్రభుత్వం డిసైడ్ అయింది.ఈలోగా సివిల్ పనులు, ఎక్విప్‌మెంట్ ట్రయల్స్ అన్నీ పూర్తి చేసి హాస్పిటల్‌ను వైద్య సేవలు అందించేందుకు సిద్ధం చేయాలని ఇప్పటికే ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఇక టిమ్స్ హాస్పిటల్ అందుబాటులోకి వస్తే తెలంగాణ ప్రభుత్వ వైద్యరంగంలో ఒక సరికొత్త అధ్యాయం మొదలుకానుంది. టిమ్స్ ఆసుపత్రిలో అత్యాధునిక 'న్యూమాటిక్ ట్యూబ్ సిస్టమ్' అందుబాటులోకి రానుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ తరహా సాంకేతికతను ప్రవేశపెట్టడం రాష్ట్రంలోనే ఇదే తొలిసారిసాధారణంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో కనిపించే ఈ విధానంలో గాలి పీడనం ద్వారా పనిచేసే పైప్‌లైన్ నెట్‌వర్క్ ఉంటుంది. దీని ద్వారా బ్లడ్ శాంపిల్స్ లేదా ఇతర మెడికల్ శాంపిల్స్‌ను హాస్పిటల్‌లోని ఒక విభాగం నుంచి మరొక విభాగానికి సెకన్ల వ్యవధిలో చేరవేయవచ్చు. అత్యవసర సమయాల్లో సిబ్బంది స్వయంగా ల్యాబ్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా, నిర్దేశిత స్టేషన్లలో శాంపిల్స్ ఉంచితే అవి నేరుగా ల్యాబ్‌కు చేరుకుంటాయి. ల్యాబ్ టెక్నీషియన్లు వెంటనే టెస్టులు నిర్వహించి, డిజిటల్ రూపంలో రిపోర్టులను క్షణాల వ్యవధిలోనే డాక్టర్లకు పంపుతారు. దీనివల్ల రోగుల నిరీక్షణ సమయం గణనీయంగా తగ్గుతుంది.ముఖ్యంగా యాక్సిడెంట్లు, గుండెపోటు వంటి అత్యవసర సమయాల్లో లేదా ఆపరేషన్ థియేటర్లలో రోగికి రక్తం ఎక్కించాల్సి వచ్చినప్పుడు ఈ వ్యవస్థ ప్రాణదాతగా మారుతుంది. తక్కువ సమయంలోనే క్లినికల్ నిర్ణయాలు తీసుకునేందుకు ఇది డాక్టర్లకు తోడ్పడుతుందని టిమ్స్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ మహబూబ్ ఖాన్ వెల్లడించారు. ప్రభుత్వ వైద్య సేవలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రిని రూపొందించినట్లు మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఏ నరేంద్ర తెలిపారు. న్యూమాటిక్ ట్యూబ్ సిస్టమ్‌తో పాటు, ఇన్ఫెక్షన్లు సోకకుండా ఉండేందుకు ప్రత్యేకమైన 'డర్టీ కారిడార్స్' వంటి నూతన డిజైన్లను ఈ ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సనత్‌నగర్ టిమ్స్ అందుబాటులోకి వస్తే సామాన్యులకు అత్యున్నత స్థాయి సాంకేతిక వైద్య సేవలు వేగంగా అందనున్నాయని అన్నారు.

# రాజ్యసభ రేసులో 12 మంది

హైదరాబాద్, మార్చి 3, తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల కోసం తీవ్ర పోటీనే నడుస్తోంది. దాదాపు డజను మంది నేతలు రేసులో ఉన్నారు. రెడ్డి సామాజికవర్గం నుంచి సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, రాజకీయ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డిలు పోటీ పడుతున్నారు. బీసీ సామాజిక వర్గం నుంచి పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు, ఈరవత్రి అనిల్ కుమార్, మహిళా కోటాలో ఇటీవలే ఉమెన్ కమిషన్ ఛైర్మన్‌గా పదవీకాలం పూర్తి చేసుకున్న నేరెళ్ల శారదలు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల నుంచి బెల్లయ్య నాయక్, దొమ్మాటి సాంబయ్య, మైనారిటీ నుండి అజ్మతుల్లా హుస్సేన్ ఉన్నారు. కమ్మ సామాజికవర్గం నుంచి కుసుమకుమార్ ఢిల్లీ స్థాయిలో పైరవీ చేస్తున్నారు. ఖాళీ అవుతున్న రెండు సీట్లలో ఒకటి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, సుప్రీంకోర్టు అడ్వకేట్ అభిషేక్ మను సింఘ్వీకి ఇవ్వాలని హైకమాండ్ ఎప్పుడో డిసైడ్ అయిందంటున్నారు. ఇప్పటికే తెలంగాణ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయనను కంటిన్యూ చేయడం ఖాయమైపోయింది. ఇక రెండో సీటు కోసం పోటీ మామూలుగా లేదు. అయితే ఈ సీటు కూడా ఇప్పటికే పార్టీ అధిష్టానం డిసైడ్ చేసిందనే చర్చ పార్టీలో జోరుగా వినిపిస్తోంది.రెండో రాజ్యసభ సీటుకు పార్టీ అధిష్టానం వంశీచంద్ రెడ్డి పేరును ప్రతిపాదిస్తోందట. వంశీచంద్ గత పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. పార్టీ పాలసీ ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసిన వారికి మళ్లీ పదవులు ఇవ్వొద్దని..టికెట్ త్యాగం చేసిన వారికే ప్రయారిటీ ఇవ్వాలని ఒక నిర్ణయం తీసుకున్నారు. కానీ వంశీచంద్ పేరును అధిష్టానం ప్రపోజ్ చేసేసరికి..రాష్ట్ర నాయకత్వం గతంలో అనుకున్న విషయాన్ని తెరపైకి తెచ్చిందట. అయితే వంశీచంద్‌కు ఇవ్వాలంటూ ఏకంగా ఏఐసీసీ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీనే సూచిస్తుండటంతో రాష్ట్ర నాయకత్వం కూడా ఏమీ చేయలేని పరిస్థితుల్లో పడిపోయిందట.తన విషయంలో రాష్ట్ర నాయకత్వం సహకరించదనే ఆలోచనతో..వంశీ..ప్రియాంక గాంధీతో చెప్పిస్తున్నారని హస్తం పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. పార్టీకి జాతీయ స్థాయిలో వంశీ అవసరాలున్నాయని..రాజ్యసభ ఎంపీగా ఉంటే పార్టీకి మరింత ఉపయోగం ఉంటుందని ప్రియాంక గాంధీ చెబుతున్నారట. గతంలో జగిత్యాల ఎమ్మెల్యేగా ఓడిన జీవన్‌రెడ్డికి ఎంపీ సీటు ఇవ్వలేదా అంటూ గుర్తు చేస్తున్నారట హస్తం పార్టీ పెద్దలు.రాజ్యసభ రేసులోకి వంశీచంద్ రావడంతో..కొత్త కొత్త ఆశావహులు తెరమీదకు వస్తున్నారట. వంశీచంద్‌ను సాకుగా చూపి..గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన నేతల్లో చాలామంది రాజ్యసభ సీటు కోసం..తమ పేరును పరిశీలించాలని విజ్ఞప్తులు చేస్తున్నారట. ఇదే విషయాన్ని రాష్ట్ర నాయకత్వం పార్టీ అధిష్టానానికి చెబుతున్నా.. ప్రియాంకగాంధీ ససేమిరా అంటున్నారట. పార్టీకి ప్రస్తుతం దేశవ్యాప్తంగా డీసీసీల ఎంపికలో కీలక పాత్ర పోషిస్తున్నందున వంశీకి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారట. అలా తెలంగాణ నుంచి ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ సీట్లను భర్తీ చేసేందుకు..కాంగ్రెస్ అధిష్టానమే ఇప్పటికే అభ్యర్థులను ఫైనల్ చేసిందన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనందున..నామినేషన్ల గడువులోపు ఈక్వేషన్లు ఏమైనా మారుతాయా? లేక అభిషేక్ మను సింఘ్వీ, వంశీచంద్‌రెడ్డి పేర్లు ఫైనల్ అయినట్లేనా అన్నది చూడాలి.

# ఫీజుల నియంత్రణకు కసరత్తు..

హైదరాబాద్, మార్చి 3 ప్రస్తుత కాలంలో పిల్లల స్కూల్ ఫీజులు తల్లిదండ్రులకు మోయలేని భారంగా మారిపోతున్నాయి. నర్సరీ, ఎల్‌కేజీలకే లక్షలకు లక్షలు డొనేషన్లు, ఫీజులు వసూళ్లు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలు రాష్ట్రంలో ఎన్నో ఉన్నాయి. దీంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ప్రైవేట్ స్కూళ్లలో తమ పిల్లలను చదివించేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది.

రాష్ట్రంలో ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై చర్యలు చేపట్టింది. ఈ మేరకు స్కూళ్ల పరిస్థితి.. అక్కడ అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అక్కడ అందున్న విద్యాబోధన తదితర అంశాలను, ఆ పాఠశాలకు సంబంధించి గత రికార్డులను బేరీజు వేసుకొని ఫీజులను నిర్ణయించేందుకు సర్కార్ సిద్ధమైంది.తెలంగాణ వ్యాప్తంగా 11వేల ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. మరో నెల రోజుల్లో 2025-26 విద్యా సంవత్సరం ముగియనుంది. వచ్చే విద్యా సంవత్సరంకు సంబంధించి పలు పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభంకానున్నాయి. అయితే, కొన్ని పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచే ఆనవాయితీకి బ్రేక్ వేస్తూ.. శాస్త్రీయంగా ఫీజులను నిర్ణయించే ప్రక్రియను స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు వేగవంతం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో ప్రస్తుతం వసూలు చేస్తున్న ఫీజులు, గత మూడేళ్ల ఆదాయ, వ్యయాల వివరాలను సేకరించాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు.ప్రతి రెండేళ్లకోసారి 8శాతం మాత్రమే ఫీజు పెంచుకునేలా ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన విధివిధానాలపై కసరత్తు ముమ్మరమైంది. ఎంఈవోలు, డీఈవోల ద్వారా ఏ స్కూళ్లో ఎంత ఫీజు ఉంది..? ఏఏ క్లాసులకు ఎంతెంత తీసుకుంటున్నారు..? అనే వివరాలను ప్రభుత్వం సేకరిస్తోంది. ప్రైవేటు స్కూళ్లలో దేని ఆధారంగా బేస్ ఫీజులను నిర్ణయించాలనేదానిపై అధికారులు కసరత్తు చేశారు.ఆయా స్కూళ్ల నిర్వహణ ఖర్చుల ఆధారంగానే స్కూళ్ల ఫీజులు ఉండాలని విద్యాశాఖ భావిస్తోంది. దీనికోసం గత మూడేళ్ల ఆడిట్ రిపోర్టులు, టీచర్ల జీతాలు, ఇతర నిర్వహణ ఖర్చులను పరిగణలోకి తీసుకోనున్నారు. ఈ లెక్కల ఆధారంగానే ఒక బేస్ ఫీజును నిర్ణయిస్తారు. దానికి తగ్గట్టుగా తర్వాతి రెండేళ్ల ఫీజు డిసైడ్ చేయనున్నారు.విద్యాశాఖపై తాజాగా సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణకు విశ్రాంత న్యాయమూర్తి లేదా ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాట్లు చేస్తామని అన్నారు. నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దు చేయడంతో పాటు సంబంధిత సొమ్మును విద్యా సంస్థల నుంచి తిరిగి రాబట్టేలా చూడాలని నిర్దేశించారు. ఫీజుల నియంత్రణకు సంబంధించిన సిఫార్సులను ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించారు.మరోవైపు.. ఫీజుల నియంత్రణ పక్కాగా అమలు చేసేందుకు స్టేట్ లెవల్ ఫీజుల నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీకి చైర్మన్‌గా హైకోర్టు రిటైర్డ్ జడ్జిని గానీ, రిటైర్డ్ చీఫ్ సెక్రటరీనిగాని నియమించాలని ప్రభుత్వం డిసైడ్ అయింది. కాగా వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఫీజుల నియంత్రణను చేపట్టాలని ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేపట్టింది.

# వరంగల్ క్రికెట్ ప్రేమికులకు తీపి కబురు

వరంగల్, మార్చి 3, వరంగల్ జిల్లాలోని క్రికెట్ ప్రేమికులకు, యువతకు గుడ్‌న్యూస్. త్వరలోనే అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం అందుబాటులోకి రానుంది. ఈ మేరకు చురుగ్గా పనులు జరుగుతున్నాయని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మె?ల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల శివారులో ఈ స్టేడియం అందుబాటులోకి రానుందని చెప్పారు. క్రికెట్ స్టేడియం అందుబాటులోకి వస్తే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు కూడా జరిగే ఛాన్స్ ఉందని చెప్పుకొచ్చారు.తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. తెలంగాణను దేశపు క్రీడా రాజధాని మార్చడమే లక్ష్యంగా సీఎం రేవంత్.. తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ 2025ను ప్రవేశపెట్టారు. ఈ పాలసీలో భాగంగా 2036 ఒలింపిక్స్‌లో మన రాష్ట్ర క్రీడాకారులు పతకాలు సాధించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్ గచ్చిబౌలిలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నారు. దీని కోసం సుమారు 200 ఎకరాల భూమిని కేటాయించారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో మినీ స్టేడియాలు, ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో స్పోర్ట్స్ స్కూల్స్ నిర్మించాలని నిర్ణయించారు.అందులో భాగంగా.. వరంగల్ జిల్లాలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు రెడీ అయ్యారు. ఈ విషయాన్ని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. త్వరలోనే జిల్లాకు క్రికెట్ స్టేడియం వస్తుందని చెప్పారు. జిల్లాలో క్రికెట్ స్టేడియం ఆవశ్యకతను సీఎం రేవంత్ రెడ్డికి వివరించగా.. ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కడియం తెలిపారు. ప్రస్తుతం స్టేడియం నిర్మాణానికి సంబంధించిన ఫైల్ ప్రభుత్వం వద్ద ఉందని అన్నారు.

కాగా, జిల్లా యువత చాలా కాలంగా క్రికెట్ స్టేడియం కోసం ఎదురు చూస్తోంది. ఈ మేరకు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నేతృత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల శివారులోని 163 నేషనల్ హైవేకు సమీపంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా)కు భూమి ఉంది. దీంతో ఆ ప్రాంతంలోనే స్టేడియం నిర్మాణం చేపడితే అనుకూలంగా ఉంటుందనే నిర్ణయానికి అధికారులు వచ్చారు.దీంతో కుడా పరిధిలోని 30 ఎకరాల భూమి వివరాలను ఎమ్మెల్యేలు, ఎంపీలు రాష్ట్ర స్పోర్ట్స్ అండ్ యూత్ సర్వీసెస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్‌రంజన్‌కు అందజేశారు. ప్రస్తుతం ఈ ఫైల్ పెండింగ్‌లో ఉండగా.. త్వరలోనే స్టేడియం నిర్మాణానికి అనుమతులు రానున్నాయి. అదే జరిగితే క్రికెట్ ప్రేమికుల చిరకాల కోరిక తీరనుంది. వరంగల్ కేంద్రంగా అంతర్జాతీయస్థాయి మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే ఛాన్స్ ఉంటుంది.

# కల్వకుంట్ల కుటుంబంలోనూ పెను తుపాను

హైదరాబాద్, మార్చి 3,ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సుదీర్ఘ కాలం సాగిన ఉత్కంఠకు రౌస్ అవెన్యూ కోర్టు తీర్పుతో తెరపడింది. మాజీ ఎమ్మెల్సీ కవితకు ఈ కేసులో క్లీన్ చిట్ లభించడం బీఆర్ఎస్ శ్రేణులకు పెద్ద ఊరటనిచ్చినప్పటికీ, ఈ తీర్పు అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు పార్టీలోనూ, కల్వకుంట్ల కుటుంబంలోనూ పెను తుపానును సృష్టించాయి. ముఖ్యంగా కేటీఆర్ చేసిన ఒక ట్వీట్, దానికి కవిత ఇచ్చిన కౌంటర్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.కోర్టు తీర్పు వెలువడిన వెంటనే కేటీఆర్ స్పందించారు. ఈ కేసు కేవలం రాజకీయ కక్ష సాధింపు అని కొట్టిపారేశారు. అయితే, తన విశ్లేషణలో ఆయన ఒక కీలక వ్యాఖ్య చేశారు. “ఢిల్లీ లిక్కర్ స్కామ్ అనే కల్పిత గాథ వల్ల అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా బలి అయింది అని పేర్కొన్నారు. కవితకు న్యాయం జరిగిందని చెబుతూనే, ఈ కేసు వల్లే పార్టీ ఓడిపోయిందనే అర్థం వచ్చేలా ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి.కేటీఆర్ చేసిన విశ్లేషణపై కవిత తీవ్రంగా మండిపడ్డారు. పార్టీ ఓటమిని తన ఖాతాలో వేయడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. “బీఆర్ఎస్ ఓటమికి నీ అహంకారమే కారణం, నాపై తప్పుడు ప్రచారాలు ఆపాలి” అంటూ ఆమె ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు.తాను జైలులో ఉన్న సమయంలో పార్టీ గానీ, అగ్ర నాయకత్వం గానీ కనీసం ఒక ప్రెస్ మీట్ పెట్టి కూడా తనకు అండగా నిలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు తన వ్యక్తిగత లాభం కోసం జరిగింది కాదని, పార్టీ ప్రయోజనాల కోసం పోరాడుతుంటే తనను ఒంటరిని చేశారని ఆమె ఆరోపించారు. నిరుద్యోగం, హామీల అమలులో వైఫల్యం వంటి కారణాల వల్ల పార్టీ ఓడిపోతే, ఇప్పుడు ఆ నెపాన్ని తనపైకి నెట్టడం సరికాదని ఆమె స్పష్టం చేశారు.ఈ వివాదం కేవలం అన్నాచెల్లెళ్ల మధ్య చిన్నపాటి ఘర్షణ మాత్రమే కాదు, దీని వెనుక లోతైన రాజకీయ కోణాలు ఉన్నాయి. కేసు గెలిచిన తర్వాత కవిత తన రాజకీయ ఇమేజ్‌ను తిరిగి పుంజుకోవాలని చూస్తున్నారు. కానీ కేటీఆర్ వ్యాఖ్యలు ఆమెను పార్టీకి నష్టం కలిగించిన వ్యక్తిగా చిత్రించేలా ఉన్నాయని ఆమె భావిస్తున్నారు. కవిత త్వరలో సొంతంగా రాజకీయ అడుగులు వేయబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఆమె తనపై ఉన్న లిక్కర్ స్కామ్ ముద్రను కోర్టు ద్వారా చెరిపేసుకున్న తరుణంలో, సొంత అన్నయ్యే దాన్ని పార్టీ ఓటమికి కారణంగా చూపడం ఆమెకు మింగుడుపడటం లేదు.లిక్కర్ స్కామ్ కేసులో న్యాయపరంగా కవిత విజయం సాధించినా, రాజకీయంగా మాత్రం కుటుంబంలో చిచ్చు రేపింది. కేటీఆర్ అహంకారం వల్ల ఓడిపోయామని కవిత, కవిత కేసు వల్లే పార్టీ దెబ్బతిందని కేటీఆర్ పరోక్షంగా వాదించుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మరి ఢిల్లీ లిక్కర్ స్కాంలో క్లీన్ చిట్ వచ్చిన తర్వాత కూడా అన్నాచెల్లెళ్లు ఇలా బహిరంగంగా విమర్శించుకోవడం ఆసక్తి రేపుతోంది.

# గుడిసెల కూల్చివేత చుట్టూ రాజకీయ దుమారం

ఖమ్మం, మార్చి 3, ఖమ్మంలోని వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఉన్న పేదల ఇళ్ల కూల్చివేత పొలిటికల్ హైడ్రామాకు దారితీసింది. భూదాన్ భూములు రెవెన్యూశాఖ పరిధిలో ఉంటాయి. అందులో కూల్చివేతలు చేపడితే..సంబంధిత శాఖ మంత్రికి సమాచారం ఉంటుంది. పైగా రెవెన్యూ శాఖ మంత్రి ఖమ్మం జిల్లాకే చెందిన మినిస్టర్. దీంతో పలువురు ప్రజా సంఘాల నేతలు భూదాన్ భూముల్లో కూల్చివేతలపై మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారట.అయితే కూల్చివేతల విషయం తనకు తెలియదని..ఖమ్మం కలెక్టర్‌కు ఫోన్ చేసి ఆరా తీశారట మంత్రి పొంగులేటి. దీంతో రెవెన్యూ శాఖ మంత్రి, పైగా జిల్లా మినిస్టర్ పొంగులేటికి తెలియకుండా కూల్చివేతలు చేపట్టే అవకాశం ఉంటుందా అన్న చర్చ జరుగుతోంది. అలా అయితే పొంగులేటిని కాదని కూల్చివేతలకు ఆదేశాలు ఇచ్చిందెవరు.? అధికారులే సొంత నిర్ణయం తీసుకుని డిమాలిషన్ చేశారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వెలుగుమట్ల ప్రాంతంలో గజం లక్షల రూపాయలు, ఎకరం కోట్ల రూపాయలు పలుకుతుందట. ఆ ప్రాంతంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరులకు భూములు ఉన్నాయని..లేదు మంత్రి పొంగులేటి సంబంధికులకే అక్కడ ల్యాండ్స్ ఉన్నాయని మరొకరు ఆరోపణలు చేసుకుంటుడం చర్చకు దారితీస్తోంది.తమ ల్యాండ్ పక్కనే భూదాన్ భూముల్లో పేదలు గుడిసెలు ఉంటే..తమ భూముల ధర పడిపోతుందనే సాకుతో ఆ భూముల్లో ఉంటున్న పేదల ఇళ్లను తొలగించారనే ఆరోపణలు రాజకీయ దుమారాన్ని లేపుతున్నాయి. అయితే పేదల ఇళ్లు తొలగింపుకు మంత్రికి ఎటువంటి సంబంధం లేదని తుమ్మల అనుచరులు కొట్టిపారేస్తున్నారు. కోర్టు పరిధిలో ఉన్న అంశంపై రాజకీయ జోక్యం ఎలా ఉంటుందని ఎదరు ప్రశ్నలు వేస్తున్నారట. కూల్చివేతలపై తనకు సమాచారమే లేదని పొంగులేటి చెబుతున్నారు.ఖమ్మం జిల్లాలోనే ముగ్గురు మంత్రులు ఉన్నారు. వీరిలో అందరికి కీలకమైన మంత్రి పదవులే ఉన్నాయి. అయితే పాలేరు ఎమ్మెల్యే, రెవన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెవన్యూ శాఖ మంత్రికి తెలియకుండా భూదాన్ భూముల్లో కూల్చివేతలు సాధ్యమేనా.? అన్న డౌట్స్ వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల స్థలాలు కూల్చివేతపై సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మంత్రి పొంగులేటిని ప్రశ్నించారు. కలెక్టర్ అనుదీప్‌కు ఫోన్ చేసి పేదల ఇళ్ల కూల్చివేతపై సీరియస్ అయ్యారు పొంగులేటి. తన శాఖకు సంబంధించి తనకు తెలియకుండా ఎలా కూల్చివేస్తారు..ఇదేం పద్ధతి అంటూ మండిపడ్డారు. ఇళ్లు కూల్చివేసిన భూదాన్ భూములు ఖమ్మం నియోజకవర్గ పరిధిలో ఉన్నాయని..ఖమ్మం నియోజకవర్గం మంత్రి తుమ్మలది కాబట్టి తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పుకొస్తున్నారట మంత్రి పొంగులేటి. ఇళ్లు కూల్చివేసిన తర్వాత పలు రాజకీయ పార్టీలు రంగంలోకి దిగాయి. ఘటనాస్థలిని సందర్శించి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. అధికార పార్టీ మాత్రం తమకు ఎటువంటి సంబంధం లేదు..కోర్టు తీర్పును అధికారులు అమలు చేశారని చెప్పుకొస్తోంది.మంత్రి పొంగులేటి తనకేం సంబంధం లేదంటూ కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఇటు తుమ్మలకు సంబంధం లేదని ఆయనఅనుచరులు చెబుతున్నారు. అలాంటప్పుడు భూదాన్‌భూముల్లోకూల్చివేతలకుఆదేశాలు ఇచ్చిందెవరు.? రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటికి తెలియ కుండానే డిమాలిషన్ చేపట్టారా.?తుమ్మల ప్రమేయం ఉందా? లేక ఆయన నియోజకవర్గ పరిధిలోకూల్చివేతలు జరిగాయి కాబట్టి అలిగేషన్స్ వస్తున్నాయా? అధికారులే కోర్టు ఆర్డర్స్ ప్రకారం ముందుకెళ్లారా అన్నది హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికైతే కూల్చివేతల వెనుక ఎవరున్నరన్నది క్లారిటీ లేదు. కాకపోతే ఖమ్మం జిల్లా మంత్రుల మధ్య మాత్రం కూల్చివేతలు కొత్త చిచ్చు పెట్టినట్లు అయిందన్న చర్చ జరుగుతోంది. భూదాన్ భూముల్లో పేదల కూల్చివేత ఇష్యూ ఎటుదారితీస్తుందో చూడాలి మరి.

## తమ్మినేనిపై వేటు

హైదరాబాద్, మార్చి 3, తెలంగాణకు చెందిన సీపీఎం సీనియర్ నేత, పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంపై ఆ పార్టీ కేంద్ర కమిటీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఆయన్ను అభిశంసిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. 2024లో జరిగిన రాష్ట్ర పార్టీ నూతన కార్యదర్శి ఎన్నికల సమయంలో ఆయన అనుసరించిన తప్పుడు రాజకీయ వైఖరి, పార్టీ నిబంధనల ఉల్లంఘనలే ఈ చర్యకు కారణంగా పేర్కొంది.రాష్ట్ర కార్యదర్శి ఎన్నికల సమయంలో ప్రజాస్వామ్యయుత చర్చకు బదులుగా లాబీయింగ్, ప్రలోభాలు, అస్తిత్వవాద రాజకీయాలు నడిచాయని కేంద్ర కమిటీ తీవ్రంగా ఆక్షేపించింది. ఈ పరిణామాలతో పార్టీ రాష్ట్ర కమిటీ నిట్టనిలువునా చీలిపోయిందని, ముఠాతత్వం ఆందోళనకర స్థాయికి చేరిందని తన నివేదికలో స్పష్టం చేసింది. పార్టీలో ఐక్యతను నెలకొల్పేందుకు పొలిట్‌బ్యూరో సభ్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని, తమ్మినేని సహా నాయకత్వంలోని ఒక వర్గం వెనక్కి తగ్గడానికి నిరాకరించిందని తెలిపింది.సీనియర్ నాయకులే తెరవెనుక మంత్రాంగాలు, ప్రచారాలు చేయడం పార్టీ సంప్రదాయాలకు పూర్తి విరుద్ధమని కేంద్ర కమిటీ దుయ్యబట్టింది. ఈ పరిణామాలపై తమ్మినేని వీరభద్రంతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు, ప్రసాద్‌ల నుంచి వివరణ కోరినట్లు వెల్లడించింది. అయితే, వారు సమర్పించిన వివరణలు అసమగ్రంగా ఉండటంతో పాటు వాటిలో ఆత్మవిమర్శ లోపించిందని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే ముగ్గురినీ అభిశంసిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఈ చర్యతో తెలంగాణ సీపీఎంలో నెలకొన్న అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి.

# డబుల్ కష్టాలు

నల్గొండ, మార్చి 3, ప్రజల కనీస అవసరాలు తీర్చేందుకు ఏ ప్రభుత్వమైనా సంక్షేమ పథకాలను అందజేస్తుంది. దానిలో భాగంగానే గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలకు కట్టించి అందజేసింది. ఇంతవరకు బానే ఉన్నా వాటి నిర్మాణంలో నాణ్యతతో కూడిన పనులు చేయకపోవడం, అక్కడ సరైన వసతులు కల్పించకపోవడంతో లబ్ధిదారులు అనేక చోట్ల అవస్థలు పడుతూనే ఉన్నారు. ఇదే విధానం మండలంలోని విభళ్ళ పురం, అప్పన్నగూడెం గ్రామాల్లోనూ కొనసాగుతోంది. 2020లో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ శంకుస్థాపన చేశారు. ఇండ్లు పూర్తయి రెండు సంవత్సరాలైనా అర్హులైన పేదలకు పంపిణీ చేయాలేదు. దీంతో సిపిఎం ఆధ్వర్యంలో 2023లో ధర్నా నిర్వహించగా అప్పుడు అర్హులను గుర్తించి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేశారు. కాంట్రాక్టర్ నాణ్యతలేని సిమెంటుతో కట్టడంతో ఆ ఇండ్లు ఇప్పుడు శిథిలావస్థకు చేరాయి.డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వచ్చిన సంతోషం లేకుండా కారు చీకట్లో మగ్గుతున్న కాలనీ వాసుల దుస్థితి కి నిదర్శనం మండల కేంద్రంతో పాటు విభళ్ళ పురం, అప్పన్నగూడెం గ్రామాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు గత ప్రభుత్వం నిరుపేదలను గుర్తించి ఇచ్చిన ఇండ్లు ఆర్భాటంగా ప్రారంభించి చేతులు దులుపుకొన్నారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో కనీస సౌకర్యాలైన కరెంట్, త్రాగునీటి సౌకర్యం , సి సి రోడ్లు లేక వచ్చిపోయే వర్షాలతో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి బురదతో కంపు కొడుతున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. అలాగే ఈగలు, దోమలు, స్వైరవిహారం చేస్తున్నాయని, కారుచీకట్లో పాములు, తేళ్ళ బెడదతో సతమతం అవుతున్నామని లబ్ధిదారులు ఇప్పటికే పలుసార్లు మండల అధికారులకు, గ్రామ పంచాయతీ కార్యదర్శి లకు పిర్యాదు చేసిన పలితం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు.కనీసం గ్రామ పంచాయతీ సిబ్బంది కూడా చెత్త సేకరణకు రావడం లేదని దీంతో ఎక్కడ చెత్త అక్కడే పేరుకపోయి కంపు కొడుతున్నదని డబుల్ బెడ్ రూమ్ గృహ నివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు డబుల్ బెడ్ రూమ్ నివాసులు పడుతున్న ఇబ్బందులను అర్థం చేసుకొని అన్ని వసతులు కల్పించి అవస్థలు లేకుండా చూడాలని కోరుతున్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేసి త్రాగునీరు, విద్యుత్తు, సైడ్ డ్రైనేజీలు, సిసి రోడ్లు వసతులను కల్పించకుండా వదిలేసిసింధీ. అప్పటి నుండి ఇప్పటి వరకు సమస్యలు మాత్రం తేలడం లేదు. డబల్ బెడ్ రూమ్ గృహనివాసులు పడుతున్న ఇబ్బందులను అర్థం చేసుకొని ఈ ప్రభుత్వమైనా వసతులను కల్పించాలి.

# కూల్చివేతలపై తీవ్రమవుతున్న విమర్శలు

నల్గొండ, మార్చి 3, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆక్రమణల తొలగింపు ప్రక్రియ ప్రస్తుతం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. చెరువుల పరిరక్షణ, మూసీ పునరుజ్జీవం వంటి ఉన్నత లక్ష్యాలతో మొదలైన ఈ ప్రస్థానం, క్షేత్రస్థాయిలో అమలు తీరు, ప్రతిపక్షాల వ్యూహాల వల్ల ప్రభుత్వానికి ప్రతికూలంగా మారుతోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తొలుత హైడ్రా ద్వారా హైదరాబాద్‌లోని చెరువుల ఆక్రమణలను తొలగించి ప్రజల ప్రశంసలు పొందింది. అయితే, ఆ తర్వాత పలు విమర్శలు ఎదుర్కొంది. తాజాగా ఖమ్మం జిల్లాలో ఆక్రమణల తొలగింపు, ఇప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకమైన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు కోసం చేపడతారని ప్రచారం జరుగుతున్న కూల్చివేతలు ప్రభుత్వానికి తలనొప్పిగా మారాయి. ఆక్రమణలు తొలగించడం చట్టబద్ధమే అయినప్పటికీ, బాధితుల ఆవేదనను ప్రతిపక్షాలు తమకు అనుకూలంగా మార్చుకోవడంలో సఫలమవుతున్నాయి. పేదల ఇళ్లను కూల్చుతున్నారు అనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లడం కాంగ్రెస్ వ్యూహాత్మక లోపంగా కనిపిస్తోంది.ఏ ప్రభుత్వానికైనా ఆక్రమణల తొలగింపు అనేది కత్తిమీద సాము వంటిది. చట్టం తన పని తాను చేసుకుపోతుందని ప్రభుత్వం చెబుతున్నా, మానవీయ కోణాన్ని విస్మరించడం వల్ల సామాన్యుల్లో అభద్రతా భావం పెరుగుతోంది. ముఖ్యంగా మధ్యతరగతి, పేద వర్గాల ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్నారనే భావన కలిగితే, అది దీర్ఘకాలంలో ఓటు బ్యాంకుపై ప్రభావం చూపుతుంది. ఖమ్మంలోనూ, హైదరాబాద్ మూసీ తీరంలోనూ బాధితుల నిరసనలు ఉధృతం కావడం, వారికి ప్రతిపక్ష నేతలు అండగా నిలవడం ప్రభుత్వానికి రాజకీయంగా ఇబ్బందికరంగా మారింది.ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్నది అసలు కంటే కొసరు ఎక్కువ అన్నట్లుగా ఉంది. అంటే, ప్రభుత్వం చేస్తున్న పని కంటే దానిపై జరుగుతున్న వ్యతిరేక ప్రచారమే ఎక్కువగా వినిపిస్తోంది. ప్రభుత్వం తన ఉద్దేశాలను ప్రజలకు స్పష్టంగా వివరించడంలో వెనుకబడిందనేది రాజకీయ వర్గాల అభిప్రాయం. కూల్చివేతలకు ముందే పునరావాస ప్యాకేజీలను ప్రకటించి, ప్రజలతో మమేకమై ఉంటే ఇంతటి వ్యతిరేకత వచ్చేది కాదు. కానీ, యంత్రాలతో నేరుగా రంగంలోకి దిగడం వల్ల ప్రతిపక్షాలకు ప్రభుత్వం అస్త్రాలను అందించినట్లయింది. ప్రభుత్వ యంత్రాంగం , రాజకీయ విభాగం మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. అధికారులు కేవలం నిబంధనల ప్రకారమే వెళ్తారు, కానీ రాజకీయ నేతలు ప్రజల నాడిని పట్టుకోవాలి. మూసీ ప్రాజెక్టు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడం కంటే, కూల్చివేతల వార్తలే ఎక్కువగా హైలైట్ అవ్వడం ప్రభుత్వ వైఫల్యమే. ముందుముందు కీలక ప్రాజెక్టులు చేపట్టాలంటే ప్రభుత్వం తన వ్యూహాన్ని మార్చుకోవాలి. కేవలం కూల్చివేతలు అనే ముద్ర పడకుండా, పునర్నిర్మాణం, సుందరీకరణ అనే సానుకూల అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. బాధితులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు లేదా మెరుగైన పరిహారం ఇచ్చి, వారిని ఒప్పించిన తర్వాతే చర్యలు తీసుకోవడం శ్రేయస్కరం. లేనిపక్షంలో, ఈ కూల్చివేతల వ్యతిరేక ప్రచారం కాంగ్రెస్ ప్రభుత్వానికి భారీ రాజకీయ మూల్యాన్ని మిగిల్చే ప్రమాదం ఉంది.

# ఇఫ్తార్ లో పాల్గొన్న కవిత



సికింద్రాబాద్.. మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ పర్వదినాన్ని జరుపుకోవడం సంతోషకరమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. వారసిగూడలో జరిగిన ఇఫ్తార్ విందుకు జాగృతి అధ్యక్షురాలు కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు పండ్లను ఇచ్చి ఉపవాస దీక్షను విరమింపచేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ అనేది పవిత్ర మాసమని ఈ మాసంలో చేసే ఉపవాస దీక్షలు గొప్పవని అన్నారు. గంగా జమున నదుల కలయిక లాగే హిందూ ముస్లింలు సోదర భావంతో ఇఫ్తార్ విందులకు హాజరు కావడం మంచి సాంప్రదాయమని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలోని ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇఫ్తార్ విందు అనంతరం తెలంగాణ జాగృతి పార్టీలో పలువురు మైనార్టీలు కవిత సమక్షంలో చేరారు.

# హోలితోనే నామకరణాలు

ఖమ్మం హోలీ పండుగకు ఆ తండాకు ఓ ప్రత్యేకత ఉంది... పుట్టిన బిడ్డకు నామకరణం చేయాలంటే హోలీ పండుగ రావాల్సిందే... ఘనంగా హోలీ అడాల్సిందే...ఆనందం,ఆప్యాయత,అనురాగం,అనుబంధం,అపూర్వం,ఆత్మీయత,అద్వితీయం,అమ్దరికలయిక....ఆకర్షితమైన అద్భుతమైన వేడుకలకు కేరాఫ్ హోలీ . గ్రామ గ్రామాలకు నడుమ గడియ దూరంలో ఉండే గిరిజన కుటుంబాలను ఒకే గూటికి చేర్చి సంబరాలు చేసే పండుగ హోలీ ...ఈ హోలీ ని గిరిజనులు ఎంతో ఘనంగా జరుపుకుంటారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ,యువకుల నుంచి వృద్దుల వరకు ఈ హోలీ సంబరాల్లో పాల్గొని సందడి చేశారు.ఇలాంటి సంబరాలుకు కేరప్ ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం లోక్యాతండా...

......ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం లోక్యాతండా లో గిరిజన సంస్కృతి కి అద్దం పట్టే విదంగా సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా ఈ హోలీ సంబరాలు తండాలో మూడు రోజుల పాటు ఘనంగా జరుపుకున్నారు. హోలీ సంబరాలకు గిరిజనులు రూ. కొట్టి వరకు ఖర్చు చేస్తారు.మెదటి రోజు తెల్లవారుజామునమూడు గంటల నుంచే కాముని దహనం కార్యక్రమం ప్రారంబమవుతుమది.

కుల పెద్దలైన... గేడియగా పిలవబడే తండా పెద్దలు లాంఛనంగా ప్రారంభిస్తారు.పుట్టిన బిడ్డలకు నామకరణం చేస్తారు. తండాలో హ్వాలీ రోజు నుంచి పుట్టిన ప్రతి బిడ్డకు మళ్లీ హ్వాలీ పండుగ రోజు మాత్రమే నామకరణం చేయడంఆనవాయితీ,అప్పటివరకు పుట్టిన బిడ్డలకు నామకరణం చేయరు.మూడోరోజు తండా వాసులు రంగోలి ఆడుతారు.కాముని దహనం చేసిన ప్రాతం నుంచి సేకరించిన బూడిదను తండా యువకులు శరీరం పై చల్లుకిని ఆ తర్వాత రంగులు చల్లుకుంటు ఆడుకుంటారు.మూడు రోజుల వేడుకతో లోక్యాతండ జనసందడితో కిటకిటలాడింది. హోలీ వేడుకలకు తండావాసులు తమ బందువులను తమ గ్రామానికి ఆహ్వానిస్తారు. తండా వాసులు ఎక్కడ స్థిరపడినా హోలీ రోజు మాత్రం లోక్యాతండాకు చేరుకోటారు. ప్రతి హోలీ పండుగకు గ్రామంలో మహిళలు కొత్త వస్తువులను కొనుగోలు చేసుకుంటారు. నూతన వస్త్రాలు ధరించి హోలీ జరుపుకుంటారు. మూడో రోజు కావడంతో హోలీని గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. పెద్దల నుంచి చిన్నారుల వరకు రంగులు చల్లుకుని ఆటపాటలతో డ్యాన్సులు నృత్యాలు చేస్తూ హోలీ నిర్వహించారు.

# వందలాది మంది అంగన్వాడీలు అరెస్ట్



పల్నాడు జిల్లా వ్యాప్తంగా వందలాది మంది అంగన్వాడీలను పోలీసులు అరెస్ట్ చేసారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిన్న చలో విజయవాడ కార్యక్రమానికి అంగన్వాడి కార్యకర్తలు వెళ్లారు. ఆందోళన చేస్తున్న తమ పట్ల పోలీసులు పాశవికంగా ప్రవర్తించారంటూ అంగన్వాడీలు మండిపడుతున్నారు. మంగళవారం తెల్లవారుజామున పోలీసులు పెద్ద ఎత్తున్న శిబిరంలోకి బలవంతంగా వెళ్లి వేలాది మందిని మూకుమ్మడిగా అరెస్టులు చేసారు. టెంట్ కూల్చేసి, లైట్లు ఆపేసి మహిళలను బలవంతంగా ఈడ్చుకుంటూ బస్సుల్లోకి ఎక్కించారంటూ అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేసారు. పోలీసుల తీరు, ప్రభుత్వ చర్యలపై అంగన్వాడీలు తీవ్ర ఆగ్రహం తో వున్నారు. నత్తెనవల్లి, రాజుపాలెం, ముప్పాళ్ళ, చిలకలూరిపేట,రొంపిచర్లలో అంగన్వాడీలను అరెస్టులు చేసారు. అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె సుబ్బారావమ్మ, రాష్ట్ర అధ్యక్షురాలు బేబిరాణి లను సత్తెనపల్లి స్టేషన్ లో నిర్బంధించారు.




## రంగుల మయంగా జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయం

### ఘనంగా హోలీ వేడుకలు జరుపుకున్న పోలీసు అధికారులు, సిబ్బంది

### హోలీ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

నిర్మల్ నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆధ్వర్యంలో ఘనంగా హోలీ పండుగ వేడుకలు జరిగాయి.ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా హోలీ వేడుకలను జరుపుకున్నారు.



ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పోలీసు అధికారులతో కలిసి రంగులు చల్లుకుంటూ పండుగను ఆనందంగా జరుపుకున్నారు. పరస్పర స్నేహభావం, ఐక్యతకు ప్రతీకగా నిలిచే హోలీ పండుగను సురక్షితంగా, పరస్పర గౌరవంతో జరుపుకోవాలని సూచించారు. జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు, సిబ్బందికి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమాజంలో సౌభ్రాతృత్వం, ఆనందం, ఐక్యత మరింత పెరగాలని ఆకాంక్షించారు. అలాగే పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

ఈ హోలీ వేడుకల్లో అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా ఏ ఎస్పీ రాజేష్ మీనా, నిర్మల్ ఏ ఎస్పీ సాయి కిరణ్ ఇన్స్పెక్టర్లు, ఆర్ ఐ లు,ఎస్ఐ లు, ఆర్ ఎస్.ఐ లు, సిబ్బంది ఉన్నారు.



# కాణిపాకం ఆలయాన్ని మూసివేసిన ఆలయ అధికారులు, అర్చకులు

చిత్తూరు జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో పాక్షిక కేతుగ్రస్త చంద్రగ్రహణం సందర్భంగా శుభకృత్ నామ సంవత్సర పాలగుణ పౌర్ణమి చంద్ర గ్రహణం సంభవించనుండగా, శాస్త్రోక్త నియమాల ప్రకారం ఆలయ దర్శనాలను ఈరోజు ఉదయం మంచి రాత్రి వరకు జరిగే ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు ఈరోజు ఉదయం 6:20 గంటల నుంచి స్వామి వారి సర్వదర్శనం నిలిపివేయనున్నారు. చంద్రగ్రహణం మధ్యాహ్నం 3:20 గంటలకు స్పర్శ కాలంతో ప్రారంభమై, సాయంత్రం 6:47 గంటలకు మోక్ష కాలంతో ముగియనుంది. శాస్త్రప్రకారం గ్రహణానికి 9 గంటల ముందే ఆలయాన్ని మూసివేయాల్సి ఉండటంతో భక్తులు ముందస్తుగా తమ దర్శనాలను ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. గ్రహణం ముగిసిన వెంటనే సాయంత్రం 6:47 గంటలకు ఆలయ ద్వారాలు తెరచి, ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం, అభిషేకం, నివేదన కార్యక్రమాలు ఏకాంతంగా నిర్వహించనున్నారు. అనంతరం రేపు ఉదయం సుప్రభాత సేవలతో స్వామివారి దర్శనం యథావిధిగా పునఃప్రారంభమవుతుందని దేవస్థానం స్పష్టం చేసింది. భక్తులు ఈ మార్పులను గమనించి సహకరించాలని అధికారులు కోరారు.

# సమిష్టి కృషితో టీబీ నిర్మూలన సాధ్యం

హైదరాబాద్ టిబి (క్షయవ్యాధి) నిర్మూలన లక్ష్యాన్ని సాధించాలంటే ప్రభుత్వం, ప్రైవేట్ ఆసుపత్రులు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. మందులతో పాటు సరైన పోషకాహారం, మానసిక ధైర్యం కల్పించే కౌన్సెలింగ్ కూడా టిబి రోగులకు ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా టిబి నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధాన్ మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ కు అనుసంధానంగా, కేర్ హాస్పిటల్స్ మరియు జగతి ఫౌండేషన్ సంయుక్తంగా "ప్రాజెక్ట్ ఓజాస్" అనే సిఎస్ఆర్ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ హరిచందన దాసరి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.హైదరాబాద్లో టిబి రోగులకు నిరంతర పోషకాహారం అందించడంతో పాటు, మానసిక సహాయం, కౌన్సెలింగ్ సేవలు అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా టిబి బాధితులకు ప్రత్యేకంగా సిద్ధం చేసిన పోషకాహార కిట్లను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, టిబి నిర్మూలన లక్ష్యాన్ని త్వరితగతిన చేరుకోవాలంటే సమాజంలోని ప్రతి వర్గం బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కేర్ హాస్పిటల్స్ మరియు జగతి ఫౌండేషన్ ముందుకు వచ్చి జిల్లా పరిపాలనకు తోడ్పడటం అభినందనీయమని, ఇటువంటి భాగస్వామ్య కార్యక్రమాలు మరింత విస్తరించాలని సూచించారు.

# నేలకొండపల్లిలో వైభవంగా శ్రీకృష్ణుడు,రుక్మిణిల కళ్యాణ మహోత్సవం

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి లోని శ్రీ సంతాన వేణు గోపాల స్వామి ఆలయంలో శ్రీకృష్ణుడు,రుక్మిణిల కళ్యాణ మహోత్సవం జరిగింది.స్వామి వారి కల్యాణాన్ని అర్చకులు సంప్రదాయ పద్ధతిలో జరిపించారు. ముందుగా ఎదుర్కోలు ఉత్సవం జరిపిన అనంతరం ఆలయ ప్రాంగణంలో ని కళ్యాణ మండపం వద్దకు ఉత్సవ మూర్తుల విగ్రహాలను తీసుకొచ్చారు.అనంతరం అంగరంగ వైభవంగా వేద మంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కళ్యాణం ఘనంగా జరిపించారు.కళ్యాణం అనంతరం ఆలయ పూజారులు దండలతో ఆడే ఆట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వామి వారి కల్యాణాన్ని చూడడానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. అనంతరం ఆలయ కమిటీ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం ఇదే రోజు స్వామి వారి కళ్యానాన్ని జరిపించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది.

## బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం మూసివేత

నిర్మల్ కేతు గ్రస్త చంద్రగ్రహణం సందర్భంగా మహా నివేదన అనంతరం శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంతో పాటు ఉప ఆలయాలకు ఆలయ అర్చకులు ద్వార బంధనం చేసారుత. అమ్మవారి క్షేత్రంలో ఈ రొజు అన్ని రకాల ఆర్జిత సేవలు రద్దు చేసారు. ఈ రొజు రాత్రి 7 గం.లకు అమ్మవారి ఆలయం తొ పాటు ఉప ఆలయాల ద్వారాలు తెరచి గోదావరి జలాలతొ మహా సంప్రోక్షణ జరిగిన తరువాత మరుసటి రోజు బుధవారం అన్ని రకాల ఆర్జిత సేవలు, పూజలు యధావిధిగా కొనసాగుతాయి

## హోలీ సంబరాలు

ఖమ్మం ఉమ్మడి ఖమ్మం జిల్లా లో ప హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అందరూ కలిసి ఆటపాటలతో రంగులు చల్లుకుంటూ హోలీ పండగ ఉత్సాహంగా జరుపుకున్నారు.

స్కూల్ సెలవు కావడంతో రంగురంగుల కలర్ , వాటర్ గన్స్, నగరంలోని పలుకూడాల్లో , వీధుల్లో డీజే పెట్టి డాన్సులు వేస్తూ రంగుల చల్లుకున్నారు ముఖ్యంగా మార్వాడీలు పూజల నిర్వహించిభక్తిశ్రద్ధలతో హోలీ ని జరుపుకున్నారు

## స్మశానవాటికలో వ్యక్తి ఆత్మహత్య

వికారాబాద్ పరిగి బస్ డిపో ఎదురుగా ఉన్న స్మశానవాటికలోని మర్రి చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్మశానవాటిక పక్క కాలనీ వాసులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు దోమ మండలం పాశంబండ తాండాకు చెందిన దీపక్ (26) గా గుర్తించారు. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు పరిగిలో అద్దెకు ఉంటూ మేస్త్రీగా పని చేస్తున్నాడు. దీపక్ ఆత్మహత్య కు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ..

# అలయ భూములను కాపాడాలని గ్రామస్థుల రిలే నిరాహార దీక్ష

వికారాబాద్ 4 వందల ఏళ్ళ చరిత్ర కలిగి ఆధ్యాత్మిక కేంద్రంగా వెలసిన సంజీవ స్వామి దేవాలయాన్ని పునర్నించాలని,అన్యాక్రాంతం అవుతున్న దేవాలయ భూములను కాపాడలని డిమాండ్ చేస్తూ వికారాబాద్ జిల్లా దోమ మండలం దొంగ ఎన్కెపల్లి గ్రామస్థులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు.ఆలయం శిథిలమైపోయినా దేవాదాయశాఖ పట్టించుకోవడం లేదని... 104 ఎకరాల దేవాలయ మాన్యాపు భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. ధర్మకర్త పేరుతో పరిగి మాజీ సర్పంచ్ పార్థసారథి ఆలయ నిర్మాణ పనులను అడ్డుకోవడమే కాకుండా ఆలయ భూములు కూడా ప్రైవేటు వ్యక్తుల చేతిలోకి వెళ్ళేందుకు కారకులవుతున్నారని ఆరోపించారు.పరిగి, చన్గోముల్ రెవెన్యూ లో ఉన్న ఆలయ భూములను మళ్ళీ ఆలయ రికార్డుల్లోకి ఎక్కించాలని....సంజీవ స్వామి ఆలయ నిర్మాణం కోసం 5 కోట్లు కేటాయించి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

# నటి దేవీప్రియ కారుకు ప్రమాదం..



## డ్రైవర్ మృతి...

ప్రముఖ బుల్లితెర నటి దేవిప్రియ తన సహాయకుడితో కలిసి సోమవారం తెల్లవారుజామున కారులో చెన్నై నుంచి తిరుచ్చి వైపు బయల్దేరారు.పెరంబలూర్ వద్ద కారు టైరు పంక్చర్ కావడంతో డ్రైవర్ ముత్తు గణేశ్(38) వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి టైరు మారుస్తుండగా వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం దేవిప్రియ కారును ఢీకొంది.ఘటనలో కారు డ్రైవర్ ముత్తు గణేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు.కారు పక్కన నిలబడి ఉన్న దేవిప్రియ తృటిలో తప్పించుకున్నారు. ఆమె సహాయకుడు దివాకర్ తీవ్రంగా గాయపడ్డారు.

# శ్రీకాకుళం ఏబీసీడబ్ల్యూవో ఇంట్లో కోట్లు .. ఏసీబీ సోదాల్లో భారీగా అక్రమాస్తులు

ఏబీసీడబ్ల్యూవో బాల ముకుందరావు ఇళ్లపై ఏసీబీ దాడులుసోదాల్లో రూ.1.10 కోట్ల విలువైన అక్రమాస్తుల గుర్తింపుమెస్ బిల్లుల మంజూరుకు లంచాలు తీసుకుంటున్నట్లు ఆరోపణలు. బంగారం, వెండి, స్థిరాస్తుల పత్రాలు స్వాధీనం చేసుకున్న అధికారులుశ్రీకాకుళం జిల్లాలో ఓ అవినీతి అధికారి బాగోతం వెలుగులోకి వచ్చింది. నరసన్నపేట వెనుకబడిన తరగతుల సహాయ సంక్షేమ అధికారి (ఏబీసీడబ్ల్యూవో) గడ్డి బాల ముకుందరావు నివాసాల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిన్న సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.1.10 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. నరసన్నపేటతో పాటు సోంపేట విభాగానికి కూడా బాల ముకుందరావు ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. వసతిగృహాల మెస్ బిల్లులు మంజూరు చేయడానికి, ప్రతి విద్యార్థికి రూ.15 చొప్పున వార్డెన్ల నుంచి ఆయన లంచం వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరి 28న అధికారులు ఆయన కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టగా, లెక్కల్లో చూపని రూ.1,84,070 నగదు పట్టుబడింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నిన్న శ్రీకాకుళం పట్టణంలోని బాల ముకుందరావుకు చెందిన రెండు ఇళ్లలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు జరిపారు. ఈ సోదాల్లో రాజాం, శ్రీకాకుళం, కొత్తవలస సబ్‌రిజస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని 4 స్థిరాస్తుల పత్రాలు, 322 గ్రాముల బంగారు ఆభరణాలు, 1.75 కిలోల వెండి వస్తువులు, కొంత నగదు, ఒక కారు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల మొత్తం విలువ రూ.1.10 కోట్లుగా ఉంటుందని, కేసుపై దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ అధికారులు తెలిపారు

# మహిళా పోలీసులకు వైద్య పరీక్షలు






గుడివాడ ఈ నెల 8 వ తేదీని జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని, మహిళా పోలీస్ సిబ్బందికి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. మహిళా సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గుడివాడ పట్టణంలోని స్థానిక ఏఆర్కేఎ హాస్పిటల్లో ఈ వైద్య పరీక్షలు నిర్వహించబడినవి. అదేవిధంగా బ్లడ్ డొనేషన్ క్యాంపు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళా సిబ్బందిలో ఆరోగ్య అవగాహన పెంపొందించడంతో పాటు, వారి శ్రేయస్సు పట్ల పోలీస్ శాఖ కట్టుబాటును చాటిచెప్పడం జరిగింది.

## కల్తీ నెయ్యి వ్యవహారం

## తిరుమల చేరుకున్న వన్ మ్యాన్ కమిషన్

తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి కల్తీ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన వన్ మ్యాన్ కమిషన్ తన విచారణను ముమ్మరం చేసింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ నేతృత్వంలోని ఈ కమిషన్ ఈరోజే తిరుమలకు చేరుకుంది.

క్షేత్రస్థాయి విచారణ

టీటీడీ మార్కెటింగ్ విభాగం, గోదాములు మరియు లడ్డూ పోటు (వంటశాల)లో కమిషన్ సభ్యులు స్వయంగా పరిశీలన జరపనున్నారు. గత ప్రభుత్వ హయాంలో నెయ్యి సరఫరాకు సంబంధించి టెండర్ నిబంధనలను ఎలా సడలించారు? తక్కువ ధరకే నెయ్యి సరఫరా చేయడానికి కంపెనీలకు ఎలా అనుమతి ఇచ్చారు? అనే అంశాలపై అధికారులను ప్రశ్నించనున్నారు. కల్తీ నెయ్యి వెనుక ఉన్న అసలు కారకులు ఎవరు, అధికారుల నిర్లక్ష్యం ఎంతవరకు ఉందనే అంశాలపై లోతైన విచారణ జరిపి కమిషన్ త్వరలోనే ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదికను అందజేయనుంది.

# సీఎం చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ భేటి





అమరావతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అయనతో భేటి అయ్యారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, ఆర్ డబ్ల్యూఎస్, అటవీ శాఖకి సంబంధించిన అంశాలపై చర్చించారు. జల్ జీవన్ మిషన్ పనుల పురోగతి, నిధుల వినియోగం, పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని రోడ్ల అభివృద్ధి నిధుల కేటాయింపు, నియోజకవర్గాల వారీగా జరిగిన కేటాయింపులు తదితర అంశాలపై చర్చ జరిగింది.

?రాష్ట్రవ్యాప్తంగా వివిధ పంచాయతీల్లో చేపట్టిన మ్యాజిక్ డ్రెయిన్ల పనుల గురించి తెలిపి అన్ని పంచాయతీల్లో ఈ తరహా డ్రెయిన్స్ నిర్మించడం ద్వారా పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా అమలు చేయవచ్చని వివరించారు . నీటిపారుదలశాఖ పరిధిలోని డ్రైనేజ్ ల్లో పూడిక తీత అంశాన్ని ప్రస్తావించిన ఉపముఖ్యమంత్రి, వేసవిలో పూడిక తీత పనులు చేపట్టి రైతులు పంటలు వేసేలోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అటవీ శాఖ చేపట్టిన హనుమాన్ ప్రాజెక్ట్ వివరాలను ముఖ్యమంత్రికి తెలియజేశారు

అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలోపై పలు అంశాలపై మాట్లాడుకోవాలని తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఈ రోజు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈసమావేశం జరిగింది.

### దళిత యువకుని మరణం పట్ల విచారణ చేస్తాం

### డిసిసిబి చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి

### మృతుని కుటుంబానికి 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం



బద్వేలు కడప జిల్లా బద్వేలు నియోజకవర్గం,శ్రీ అవదూత కసినాయన మండలం, గంగనపల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు దిలీప్ అత్యంత కిరాతక హత్యకు గురైన ఘటన ప్రతి మనిషి మనసును కలచివేసింది. ఒక అమాయక యువకుడిని పెట్రోల్ పోసి దహనం చేయడం అనేది మానవత్వానికి మచ్చ. ఇది కేవలం ఒక కుటుంబానికి జరిగిన విషాదం మాత్రమే కాదు? మన సమాజానికి జరిగిన అవమానం.ఈ దారుణ ఘటనపై కడప డిసిసి బ్యాంక్ చైర్మెన్ మంచురి సూర్యనారాయణ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మంగళవారం శ్రీ అవధూత కాశి నాయన మండలం లోని గంగనపల్లి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను స్వయంగా పరామర్శించారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులను ధైర్యం చెప్పి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.కొడుకుని కోల్పోయిన ఆ తల్లిదండ్రుల వేదన వర్ణించలేనిది. వారి కన్నీళ్లు చూసిన ప్రతివారూ కలత చెందకుండా ఉండలేరు. ఈ కష్టసమయంలో కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇస్తూ, తన వంతుగా తక్షణ సహాయంగా రూ.50,000 ఆర్థిక సాయం అందజేశారు. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు? వారి వెంటే మేమున్నాం అనే నమ్మకానికి చిహ్నం.ఈ అమానుషానికి పాల్పడిన దుర్మార్గులను వెంటనే అరెస్ట్ చేసి, చట్టపరంగా అత్యంత కఠినమైన శిక్ష విధించాలని పోలీసులను ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. నిందితులు ఎంతటి ప్రభావం ఉన్న వారైనా సరే చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేశారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు విశ్రమించేది లేదని, బద్వేల్ టీడీపీ నాయకత్వం కుటుంబం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు.మన కూటమి ప్రభుత్వం దళితుల రక్షణకు కట్టుబడి ఉందని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుండి అందాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలు ? ఆర్థిక సహాయం, న్యాయ సహాయం, భద్రత ? త్వరగా అందేలా చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. సమాజంలో ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గ యువనాయకులు చెరుకూరి రవికుమార్, డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్, అరవ శ్రీనివాసులు, భిరం జయరామిరెడ్డి, బాలిరెడ్డి, ప్రహల్లదరెడ్డి, వెంకటరెడ్డి, రమణారెడ్డి, మొగల్ రహమతుల్లా, రామయ్య, శంకర్ రెడ్డి, సిద్ధారెడ్డి, క్రిష్ణారెడ్డి, సుబ్బారాయుడు యాదవ్, కరుణాకర్, సమరసింహారెడ్డి, వివరమిరెడ్డి, షేక్ రఫీ, సురేంద్ర,పగిడి సందీప్,మిట్ట వంశీ తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి సంఘీభావం ప్రకటించారు.

## చిలకలూరిపేటలో వీధి కుక్కల దాడి?.

## 10వ వార్డులో స్వైరవిహారం చేస్తున్న వీధికుక్కలు?

## పది మందికి గాయాలు

పల్నాడు జిల్లా చిలకలూరిపేట 10వ వార్డులో వీధికుక్కల దాడిలో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. పిచ్చికుక్క వీధిలో వెళ్తున్న వారిని, వెంటాడి మరీ కరిచింది. ఈ దాడిలో సుమారు 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితులందరినీ వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో పట్టణ ప్రజలు బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. జిల్లాలో వీధి కుక్కలపై పశుసంవర్ధక శాఖ అధికారుల ఎటువంటి పర్యవేక్షణ లేకపోవడంతో కుక్కల సంతానోత్పత్తి పెరిగి వీధుల నిండా కుక్కల గుంపులు దర్శనమిస్తున్నాయి. వీటికి తోడు కుక్కలకు వింత వ్యాధులు ప్రబలడం ఆందోళన కలిగిస్తోంది. . వీటి ద్వారా ఇతర అంటు వ్యాధులు వ్యాపిస్తాయని స్థానికులు భయపడుతున్నారు. ఆపరేషన్లు చేశామని చెబుతున్నా, కుక్కల సంతతి ఏమాత్రం తగ్గకపోగా, అవి యథేచ్ఛగా సంతానోత్పత్తి ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది. వీధి కుక్కల సమస్య పరిష్కారానికి, పట్టణం శివారులో ప్రత్యేకంగా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గతంలో కోర్టు ఆదేశాలు ఇచ్చినా చిలకలూరిపేట మున్సిపాలిటీలో మాత్రం ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. అధికారుల ఉదాసీనత వల్లే సామాన్యుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కుక్కల బెడద నుండి తమను రక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పల్నాడు జిల్లాలో దీపావళి గోడౌన్లలో తనిఖీ

# నిర్వహించిన అడిషనల్ ఎస్పీ, డిఎస్పీలు

పల్నాడు చిలకలూరిపేట దీపావళి గోడౌన్లలో పోలీసు అధికారులు తనిఖీలు జరిపారు. ఇక్కడ ఉన్న రెండు గోడౌన్లలో స్వయంగా అడిషనల్ ఎస్పీ నిరంజన్, డిఎస్పి హనుమంతరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. గోడౌన్లలో ఉన్న మొత్తం బాణాసంచాలో పేలుడు పదార్థాలు ఏం మేరకు ఉన్నాయో నిపుణులతో పరీక్షలు జరిపి తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

## చంద్రగ్రహణం కారణంగా శ్రీవారి ఆలయ

## తలుపులు మూసివేసిన అధికారులు





తిరుమల మంగళవారం నాడు చంద్రగ్రహణం నేపథ్యంలో తిరుమల శ్రీవారి ఆలయంతో పాటుగా టీటీడీ స్థానిక ఆలయాలను కూడా మూసివేసారు. ఈ విషయాన్ని టీటీడీ అధికారులు మీడియాకు తెలిపారు. ఉదయం 3:21 గంటల నుంచి రాత్రి 6:47 గంటల వరకు ఆలయాలను మూసివేసారు. . గ్రహణం విడిచిన తర్వాత శుద్ధి నిర్వహించి భక్తులను దర్శనాలకు అనుమతి ఇస్తారు. గ్రహణం నేపథ్యంలో టీటీడీ నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణ కేంద్రాలు కూడా తాత్కాలికంగా ఆపివేశారు.

### హోలీ పండుగ శుభాకాంక్షలు,జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

### జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా హోలీ వేడుకలు



జగిత్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో హోలీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. పోలీస్ అధికారులు మరియు సిబ్బంది తో ఉత్సహంగా, సంతోషంగా హోలీ వేడుకలు నిర్వహించడం జరిగింది. హోలీ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ జిల్లా ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు. రంగుల పండుగ హోలీ అందరికీ సంతోషం కలగాలని, మీ జీవితాల్లో కొత్త ఉత్సాహాన్ని, వెలుగులను నింపాలని ఆకాంక్షించారు.

## అపోలో యూనివర్సిటీలో వికసిత్ భారత్ కార్యక్రమం

## పాల్గొన్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



చిత్తూరులోని అపోలో యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన వికసిత్ భారత్ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు పాల్గొని, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వికసిత్ భారత్ ముఖ్య ఉద్దేశాన్ని ఆ విద్యా సంస్థ విద్యార్థులకు తెలియజేసిన చిత్తూర్ ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ,..,భారతదేశ ఉజ్వల భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని ఈ సందర్భంగా తెలిపారు.. ఈ విషయాన్ని గ్రహించిన ఎన్డీఏ సర్కార్ ఆదిశగా ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ వినోద్ బట్, ప్రోగ్రాం కన్వీనర్ అప్పారావు, యూనివర్సిటీ ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాలో షీ టీమ్స్తో మహిళలు, బాలికలకు భద్రత

## ఎస్పీ డి.జానకి



మహబూబ్నగర్ జిల్లాలో మహిళలు, బాలికలు, విద్యార్థినులకు సంపూర్ణ భద్రత కల్పించేందుకు ×షీ టీమ్స్× బృందాలు నిరంతరం కృషి చేస్తున్నాయని జిల్లా ఎస్పీ డి.జానకి, ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాసంస్థలు, బస్సు స్టేషన్లు, రైల్వే స్టేషన్లు మరియు ఇతర రద్దీ ప్రదేశాలలో షీ టీమ్స్ సిబ్బంది సివిల్ డ్రస్లో నిత్యం నిఘా నిర్వహిస్తున్నారని తెలిపారు.

×ఫిబ్రవరి× నెలలో జిల్లాలో మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్న పోకిరీలపై కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మొత్తం 20 ఫిర్యాదులు అందగా, అందులో 4 కేసుల్లో కౌన్సిలింగ్ నిర్వహించగా, 14 మందిని రెడ్ హ్యాండెడ్గా పట్టుకుని చర్యలు తీసుకున్నామని, 2 ఎఫ్ఐఆర్లు నమోదు చేయడంతో పాటు 6 ఈ-పెట్టి కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే 12 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, జిల్లాలోని 70 హాట్స్పాట్ ప్రాంతాలను సందర్శించి నిఘా నిర్వహించినట్లు తెలిపారు.

జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, తెలంగాణ మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలల్లో షీ టీమ్స్ బృందాలు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో చట్టం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ తదితర అంశాలపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నాయని ఎస్పీ గారు తెలిపారు. బాలికలు, విద్యార్థినులు తమపై ఎలాంటి వేధింపులు జరిగినా భయపడకుండా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.

మహిళల రక్షణ కోసం తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకంగా షీ టీమ్స్ ఏర్పాటు చేయబడిందని, మహిళలు మరియు బాలికల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఎవరైనా రోడ్డుపై అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా, వేధింపులకు పాల్పడినా వెంటనే డయల్ 100 లేదా జిల్లా షీ టీమ్ నెంబర్ 8712659365 కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

విద్యార్థినులు మరియు మహిళలు తమ విద్యపై దృష్టి సారించి భవిష్యత్తును నిర్మించుకోవాలని, ప్రతి ఒక్కరి రక్షణ కోసం షీ టీమ్స్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని ఎస్పీ గారు తెలిపారు. విద్యాసంస్థల వద్ద మరియు రద్దీ ప్రదేశాలలో షీ టీమ్స్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తున్నారని తెలిపారు.

అదేవిధంగా పాఠశాలలు, కళాశాలల్లో గుడ్ టచ్ ? బ్యాడ్ టచ్, బాల్య వివాహాల దుష్పరిణామాలు, సైబర్ క్రైమ్స్, సోషల్ మీడియా వినియోగం, మానవ అక్రమ రవాణా, సెల్ఫ్ డిఫెన్స్, మహిళా మరియు బాలల రక్షణకు ఉన్న చట్టాలపై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, బాలికలు షీ టీమ్స్ సేవలను వినియోగించుకోవాలని, ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ సూచించారు.

# పోలీసుల సంక్షేమమే ముఖ్యం .

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్



కర్నూలు మార్చి 8న జరగబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. పోలీసుల సంక్షేమమే ముఖ్యమని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్పీ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో కర్నూలు మెడికవర్ హాస్పిటల్ వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కర్నూలు ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో ముఖ్యంగా మహిళా పోలీసు సిబ్బంది ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి వైద్యులు తగిన సూచనలు, సలహాలు అందించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకుండా తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. మహిళా సాధికారతలో ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తుందని, మహిళలు శారీరకంగా మరియు మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. జిల్లా పోలీసు శాఖ పోలీసుల సంక్షేమం కోసం ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందన్నారు. 185 మంది కి రక్తపోటు, షుగర్, ఈసిజి, టుడిఈకో, పిఎఫ్ టి , బి ఎమ్ డి వంటి పరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం వైద్యుల బృందాన్ని ఎస్పీ అభినందించి, శాలువాతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ ఎం. మహేష్ కుమార్, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, మహిళా పీఎస్ డీఎస్పీ ఉపేంద్రబాబు, హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, పోలీసు వెల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి, మెడికవర్ హాస్పిటల్ డాక్టర్లు మంజునాథ్, రఘునందిని, సువర్ణ, సింధూర, స్పెషల్ బ్రాంచ్ సిఐ మధుసుధన్ రావు, మహిళా పీఎస్ సీఐ రామయ్యనాయుడు, ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, ఆర్ఐలు జావేద్, నారాయణ, ఆర్ఎస్ఐలు, మహిళా పోలీసులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# భద్రాచలం ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో భారీ మోసం

## అశ్వాపురం మండలానికి చెందిన కొంతమంది ఏజెంట్ల ముఠా నకిలీ పత్రాలతో నిరుపేదలపై ఇన్సూరెన్స్ ..ఆపై వారు చనిపోయినట్లుగా చిత్రీకరించి కోట్లు కాజేత దాదాపు రూ.1.52 కోట్లు డ్రా

భద్రాచలం మార్చ్ 3 భద్రాచలం ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. నకిలీ పత్రాలతో నిరుపేదలపై ఇన్సూరెన్స్ తీసుకుని.. ఆపై వారు చనిపోయినట్లుగా చిత్రీకరించి కోట్లు కాజేసినట్లు తెలిసింది. ఈ ఘరానా మోసం ద్వారా దాదాపు రూ.1.52 కోట్లను కాజేసినట్లుగా తేలింది. వివరాల్లోకి వెళ్తే.. అశ్వాపురం మండలానికి చెందిన కొంతమంది ఏజెంట్లు ఓ ముఠాగా ఏర్పడ్డారు. ఎల్ఐసీ నిబంధనల్లో లొసుగులను ఆసారాగా చేసుకున్నారు. నేరుపేదల పేరిట నకిలీ పత్రాలతో పాలసీలు తీసుకున్నారు. అనంతరం వారు చనిపోయినట్లుగా తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాలను సృష్టించారు. అలా కోటిన్నర రూపాయలకు పైగా కాజేశారు. క్షేత్రస్థాయిలో విచారణ చేయాల్సిన యంత్రాంగం సైతం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం గమనార్హం.

ఖజానా ఖాళీ అయ్యాక గానీ నిద్రలేచిన అధికారులు..అంతా అయిపోయి, ఖజానా ఖాళీ అయ్యాక గానీ ఎల్ఐసీ బ్రాంచ్ నిర్వాహకులకు అసలు విషయం బోధపడలేదు. అంతర్గత తనిఖీల్లో ఈ అక్రమాలు బయటపడటంతో లబోదిబో మంటూ వారు పోలీసులను ఆశ్రయించారు. ప్రస్తుతం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఇంత భారీ మొత్తంలో నగదు పక్కదారి పడుతున్నా ఉన్నతాధికారులు ఎందుకు గుర్తించలేకపోయారనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. భద్రాచలం బ్రాంచ్లో ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతుండటంతో పాలసీదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బ్రాంచ్ అధికారుల సహకారం లేకుండా ఇంత పెద్ద మొత్తంలో స్కామ్ జరగడం సాధ్యమేనా? నకిలీ పత్రాలతో వెరిఫై చేయడంలో సిబ్బంది ఎందుకు విఫలమయ్యారు? సాధారణ ప్రజలకు క్లెయిమ్ రావాలంటే నెలల తరబడి తిప్పించే అధికారులు, ఈ కేటుగాళ్లకు ఎలా సహకరించారు? అనే సందేహాలను వ్యక్తం చేస్తున్నారు.

# బోసి పోయిన శంషాబాద్ విమానాశ్రయం



రంగారెడ్డి పశ్చిమాఆసియాదేశాల్లో కొనసాగుతున్నాయుద్ధ ప్రభావం అంతర్జాతీయ విమాల రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. యుద్ధం మొదలైన గతనాలుగురోజులుగా శంషాబాద్ విమానాశ్రయానికి రాకపోకలు సాగించే పలు విమానాలు పెద్ద ఎత్తున అవుతుండడంతో శంషాబాద్ ఎయిర్పోర్టులో ప్రయాణికులు లేక ఎయిర్పోర్ట్ బోసిపోయింది. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి సగటున 42 నుంచి 48 విమానాలు ప్రతిరోజు అంతర్జాతీయ గమ్యస్థానాలను రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ఇందులోప్రధానంగా గల్ఫ్,దేశాలకుఅత్యధికంగా28సర్వీసులు రాకపోకలు సాగిస్తుంటాయి. యుద్ధ ప్రభావం నుంచి ప్రతిరోజు 20 నుంచి 25 వరకు అరైవల్,డిపార్చర్,విమానాలు రద్దు అవుతున్నాయి. సుమారు40వేలమంది ప్రయాణికులు రాకపోకలుశంషాబాద్ ఎయిర్పోర్ట్ నుంచి నిలిచిపోయాయి. ఏవివిధ విమానా సంస్థల టికెట్లు కౌంటర్ల వద్ద ఎవరు కనిపించకుపోవడంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. శంషాబాద్ ఎయిర్పోర్ట్ అంతర్జాతీయ విమానాశ్రయం ఇమిగ్రేషన్ చెకింగ్స్ 10,11 గేట్ల వద్ద జనాలు లేక నిర్మానుషంగా కనిపిస్తుంది.

# ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఓ మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్కలు

జడ్చర్ల మార్చ్ 3 ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఓ మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న సంఘటన మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... నాగసాల గ్రామానికి చెందిన పోలే భీమేశ్వర్ అనే వ్యక్తి లారీ డ్రైవర్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భీమేశ్వర్ చెరువులో పడి అనుమానాస్పదంగా మృతి చెందాడు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మార్చురీలో ఉన్న శవాన్ని కుక్కలు పీక్కుతిన్నాయి. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రకళ స్పందించారు. సిబ్బంది మార్చురీలోకి వెళ్తుండగా కుక్కలు అందులోనికి వెళ్లాయని వివరణ ఇచ్చాడు. ఈ మధ్యనే 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చారు. కానీ మార్చురీలో మాత్రం సదుపాయాలు కల్పించకపోవడంతో పాత మార్చురీనే నిర్వహిస్తున్నారు. మార్చురీలో శవాన్ని తీసుకెళ్లాలంటేన బంధువులు భయపడుతున్నారు.

# టెన్త్, ఇంటర్ విద్యార్థినిలు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

## డివిఎంసి మెంబర్ లింగాల నాగరాజు



పాములపాడు ఆదర్శ పాఠశాల హాస్టల్ లో ఉన్న టెన్త్, ఇంటర్ విద్యార్థినిలు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని నంద్యాల జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏపీ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాన్ని సందర్శించి డివిఎంసి మెంబర్ ఎల్.నాగరాజు విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ మీరందరూ కష్టపడి చదివి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని, మీ బంగారు భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని అన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాటలను శ్రద్ధగా విని, మీరు బాగా చదివి ఉన్నత స్థాయికి పోవాలని ఆయన అన్నారు. మీ పాఠశాలకు, మీ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని అన్నారు. మీరు పబ్లిక్ పరీక్షాలని భయపడకుండా నిర్భయంగా రాయాలని, కష్టపడితే సాధించలేనిది ఈ లోకంలో ఏదీ లేదని ఆయన అన్నారు. అనంతరం విద్యార్థినీయులకు ఏర్పాటుచేసిన భోజనాన్ని కూడా తనిఖీ చేయడమైనది.

# మియాపూర్ మక్తలో విషాదం: ప్రేమ వ్యవహారంతో యువతి ఆత్మహత్య



హైదరాబాద్ మియాపూర్ మక్త ప్రాంతంలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. 20 ఏళ్ల యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. మెదక్ జిల్లా నారాయణఖేడ్ గ్రామానికి చెందిన యువతి సోను భాయ్, మియాపూర్ మక్తలోని ఫస్ట్ హెల్త్ ల్యాబ్లో పనిచేస్తూ, అక్కడే అద్దెకు తీసుకున్న 2 ఃఊఐ ఫ్లాట్లో నివాసం ఉంటున్నట్లు సమాచారం. గత కొంతకాలంగా ప్రేమ వ్యవహారం కొనసాగుతున్న నేపథ్యంలో, నిన్న రాత్రి ఆమె నివాసం ఉంటున్న అద్దె ఇంట్లో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. సహచరులు గుర్తించి వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# అహోబిలంలో రెడ్ క్రాస్, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు.




అహోబిలం ఆళ్లగడ్డ మండలంలోని దిగువ అహోబిలంలో మంగళవారం రథోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రెండు రోజులపాటు భక్తుల కోసం వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సొసైటీ చైర్మన్ దస్తగిరి, ఆర్ ఎం పిడబ్ల్యూ అధ్యక్షుడు నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలలో గత కొద్ది సంవత్సరాలుగా భక్తులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజున 500 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి విజయకాంత్ రెడ్డి, కోశాధికారి తిరుపాల్ యాదవ్, వైద్య సంక్షేమ సంఘం సభ్యులు ఎస్ బి వీరేష్, ఈశ్వరయ్య, మౌలాలి, నాగేశ్వరరావు, డాక్టర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు



చిత్తూరు జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో పోలీసులు ఆ ఆవరణలో తనిఖీలు చేపట్టారు. ఒకటవ పట్టణ సీఐ మహేశ్వర తదితరఅదికారులు తనిఖీల్లో పాల్గొన్నారు. ఈరోజు కోర్టు ప్రాంగణానికి బాంబు బెదిరింపు సమాచారం అందింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్తో కలిసి కోర్టు పరిసరాలను పూర్తిగా తనిఖీలు నిర్వహించారు.

# రాహుల్ ప్రధాన మంత్రి కావాల్సిన అవసరం ఉంది మల్లు రవి...ఎంపీ




హైదరాబాద్ రాహుల్ గాంధీ ఈ దేశానికి ప్రధాన మంత్రి కావాలని నిన్న జరిగిన డీసీసీ శిక్షణా ముగింపు సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రతిపాదన పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న.. స్వాగతిస్తున్నామని ఎంపి మల్లు రవి అన్నారు. రెండుసార్లు రాహుల్ గాంధీ గారికి ప్రధాని అయ్యే అవకాశాలు ఉన్న కూడా ఆసక్తి చూపలేదు. ప్రజలకు దగ్గరగా ఉండి వారి సమస్యలు తెలుసుకొని తర్వాత నే పాలకుడిగా రావాలి అనుకున్నారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ లో అనేక సమస్యలపై చేస్తున్న పోరాటాన్ని దగ్గర ఉండి చూస్తున్నాం.. ఇప్పుడు ఆయన మొదటి సారి ప్రధాన మంత్రి ఆయ్యేందుకు అంగీకారం తెలిపారు. దేశానికి రాహుల్ ప్రధాన మంత్రి కావాల్సిన అవసరం ఉందని అన్నారు.

రాహుల్ గాంధీ దేశ్లో సామాజిక సమస్యలపై పూర్తి అవగాహన తెచ్చుకున్నారు. భారత్ జోడో, న్యాయ యాత్రాలతో ఆయన దేశం అంత పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. లీడర్ ఆఫ్ అపోజిషన్ గా ఉండి ఆయన నేడు దేశ సమస్యలపై అద్భుతమైన పోరాటం చేస్తున్నారు. సమాజంలో ఎవరి వాటా ప్రకారం వాళ్లకు ఫలాలు అందాలని ఉద్యమిస్తున్నారు. రాహుల్ గాంధీ ఆశయాలను అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కుల ఘనన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేస్తున్నారు. ఆయన తండ్రి, ఆయన నానమ్మ, ఆయన ముత్తత లు ప్రధాన మంత్రులుగా పని చేసారు. రాహుల్ గాంధీ కి ప్రధాన మంత్రి పదవిపై ఆసక్తి లేదు. వాళ్ళు అంత పేదరిక నిర్మూలన కోసం పని చేసారు. నేడు దేశానికి రాహుల్ గాంధీ సేవలు చాలా అవసరం.. రాహుల్ గాంధీ ప్రధాన మబత్రి చేయడానికి రేవంత్ రెడ్డి చేసిన ప్రతిపాదనను రాహుల్ గాంధీ అంగీకరించడం హర్షణీయం.. సీఎం రేవంత్ రెడ్డి కి ఎంపీల ఫోరమ్ తరపున ధన్యవాదాలని అన్నారు.

# సంపూర్ణ చంద్రగ్రహణం నేపథ్యంలో ఆలయాల మూసివేత

హైదరాబాద్ మార్చి3: నేడు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడనున్న నేపథ్యంలో వేములవాడ, యాదగిరిగుట్ట, బాసర ,భద్రాచలం, కీసర లతో పాటు దాదాపు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆలయాలను మూసివేశారు. వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రాచలం, బాసర, కీసర సహా అన్ని ప్రధాన ఆలయాలతో పాటు చిన్న ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం మూసివేశారు. చంద్రగ్రహణం అనంతరం సాయంత్రం 7 గంటలకు సంప్రోక్షణ చేసి, తిరిగి ఆలయాలను తెరవనున్నారు.

# రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ.. బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ తో పాటు మరో 8 మందికి రాజ్యసభలో స్థానం..

రాజ్యసభ ఎన్నికల వేళ అయింది. ఈ క్రమంలో బీజేపీ అధిష్ఠానం దూకుడు పెంచింది. మంగళవారం తొమ్మిది మంది రాజ్యసభ అభ్యర్థుల లిస్ట్‌ను ప్రకటించింది. ఈ తొమ్మిది మందిలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కూడా ఉన్నారు. ఆయన బిహార్ నుంచి రాజ్యసభకు వెళ్లనున్నారు. భారత ఎన్నికల సంఘం ఫిబ్రవరి 18, 2026న రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో 10 రాష్ట్రాల్లోని మొత్తం 37 రాజ్యసభ స్థానాలు ఖాళీ అవ్వనుండగా వాటికి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఈ స్థానాలు ఖాళీ అవ్వనున్నాయి. ఈ జాబితాలో తెలంగాణ నుంచి రెండు స్థానాలు ఖాళీ అవ్వనున్నాయి. ఇందులో బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ పదవుల స్థానాలు ముగుస్తాయి. వీరి పదవి కాలం ఏప్రిల్ 9వ తేదీతో ముగుస్తుంది. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఎంపీల ఎన్నిక పూర్తి కానుంది.అభ్యర్థుల పేర్లు, ఎంపికైన రాష్ట్రం పేరు: బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌కు రాజ్యసభకు ఎంపిక చేశారు. ఆయన బిహార్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆయనతో పాటు నివేశ్ కుమార్ కూడా ఉన్నారు. అసోం నుంచి తేరాష్ గోవాలా, జోగెన్ మోహన్, హర్యానా నుంచి సంజయ్ భాటియా, ఛతీస్‌గడ్ నుంచి లక్ష్మి వర్మ, ఒడిశా నుంచి మన్మోహన్ సావల్, సుజిత్ కుమార్, పశ్చిమ బెగాల్ రాహుల్ సిన్హా ఉన్నారు.

# ప్రణాళికాబద్ధంగా అన్నమయ్య జిల్లా అభివృద్ధి

రాయచోటి ,మార్చి 03: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో అన్నమయ్య జిల్లాను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేస్తామని జిల్లా ఇన్చార్జ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లెలో డిడిఆర్సి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూప్రజల సంక్షేమము మరియు అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.ప్రాజెక్టు జలధార రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ఆదర్శంతెలిపారు.జిల్లా యంత్రాంగం కష్టపడి పని చేస్తే వచ్చే గుర్తింపుకు అన్నమయ్య జిల్లా ఒక ఉదాహరణ అని చెప్పారు.ప్రణాళిక బద్ధంగా జిల్లా అభివృద్ధికి డిడిఆర్సి ఒక గొప్ప వేదిక అన్నారు.ప్రజల సంక్షేమము మరియు అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్షమని, ప్రాజెక్టు జలధార రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ఆదర్శమని జిల్లా యంత్రాంగం కష్టపడి పనిచేస్తే వచ్చే గుర్తింపుకు అన్నమయ్య జిల్లా ఒక ఉదాహరణ అని రాష్ట్ర రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి మరియు జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. మదనపల్లి కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆధ్వర్యంలో... రాష్ట్ర రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి మరియు జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు బీసీ జనార్దన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశాన్ని ప్రారంభిస్తూ ముందుగా గత డి డి ఆర్ సి సమావేశంలో జరిగిన ముఖ్యమైన అంశాలపై తీసుకున్న చర్యలపై వివిధ శాఖల జిల్లా అధికారులు... మంత్రులకు, జిల్లా కలెక్టర్కు, సంయుక్త కలెక్టర్కు, ఎమ్మెల్యేలకు ప్రజాప్రతినిధులకు వివరించారు. దీనిపై స్పందించిన జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు మాట్లాడుతూ ప్రజలకు మంచి పాలన ఏ విధంగా అందించాలి అనే దృక్పథంతో అధికారులందరూ పనిచేయాలని వారికి ఎటువంటి సమస్య వచ్చిన ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వాటి ప్రస్తుత స్థితిపై సంబంధిత అధికారులు కమిటీ సభ్యులకు వివరించారు. వ్యవసాయం ఉద్యానవనం పశు సంవర్ధక శాఖలు.వ్యవసాయ శాఖపై... జిల్లాలో వేరుశెనగ ఉలవ తదితర పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని యూరియా కొరత లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తెలపగా స్పందించిన పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి కొన్ని ప్రాంతాలలో యూరియా కొరత ఉందని దీనిపై చర్యలు తీసుకోవాలని సూచించారు దీనిపై మాట్లాడిన ఇన్చార్జి మంత్రివర్యులు రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు ఉద్యానవన శాఖ జిల్లా అధికారి, అన్నమయ్య జిల్లాలో పండిస్తున్న ముఖ్య ఉద్యానవన పంటలు సాగు విస్తీర్ణం ముఖ్యమైన పథకాలు తదితర అంశాల పై కమిటీ సభ్యులకు వివరించారు. జిల్లాలో అత్యధిక జీవీఏ అందించే ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తున్నామన్నారు. మామిడి రైతులకు ఫ్రూట్ కవర్లను అందించడం ద్వారా 75% అధిక ఆదాయాన్ని పొందగలుగుతున్నారని వివరించారు. సూక్ష్మ నీటిపారుదల శాఖపై సంబంధిత జిల్లా అధికారి అన్నమయ్య జిల్లాలో సాగు విస్తీర్ణం భవిష్యత్తు ప్రణాళికలను కమిటీ సభ్యులకు వివరించారు. మొబైల్ యాప్ ద్వారా డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను వినియోగించే విధానాన్ని రైతులందరికీ అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని ఇన్చార్జి మంత్రివర్యులు సూచించారు. ×ఇంజనీరింగ్ శాఖలు×ఇంజనీరింగ్ శాఖలైన పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, రహదారులు మరియు భవనాల శాఖ, హౌసింగ్ శాఖ, డ్వామా, గ్రామీణ నీటి సరఫరా శాఖ, నీటిపారుదల శాఖ మరియు భూగర్భ జల శాఖల జిల్లా అధికారులు ఆయా శాఖల అంశాలను కమిటీ సభ్యులకు వివరించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పల్లె పండుగ పనులు సజావుగా జరుగుతున్నాయని కొన్ని బిల్లులు రావాల్సి ఉందని వివరించారు. రహదారులు మరియు భవనాల శాఖ జిల్లా అధికారి అన్నమయ్య జిల్లాలో చేపడుతున్న రహదారులు గుంతల పూడిక కార్యక్రమం ప్రస్తుత స్థితిగతులను వివరించారు. జిల్లాలో చేపడుతున్న పేదలందరికీ ఇల్లు ఎన్టీఆర్ హౌసింగ్ పథకం పై సంబంధిత జిల్లా అధికారి ఇప్పటివరకు పూర్తయిన ఇళ్ళ సంఖ్య, పూర్తి కావాల్సిన ఇళ్ళు తదితర అంశాలను కమిటీ సభ్యులకు వివరించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో ఫారం పాండ్స్, పశువుల కొట్టాలు, సీసీ రోడ్లు తదితర అంశాలను సంబంధిత జిల్లా అధికారి కమిటీ సభ్యులకు వివరించారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు జలజీవన్ మిషన్ పై సంబంధిత జిల్లా అధికారి వివిధ అంశాలను వివరించారు.భూగర్భ జలాల పెరుగుదలకు కృషి చేసిన జిల్లా కలెక్టర్ ను అభినందించిన మంత్రులుఅన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మరియు జిల్లా యంత్రాంగం ప్రాజెక్టు జలధర ద్వారా భూగర్భ జలాల పెరుగుదలకు చేసిన కృషిని మంత్రులు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందించారు. సాగునీటి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అడవి పల్లి రిజర్వాయర్ శ్రీనివాసపురం రిజర్వాయర్ హెచ్ ఎన్ ఎస్ ఎస్ ప్రధాన కాలువ పనులు జరికోనా ప్రాజెక్టు తదితర అంశాలపై సంబంధిత జిల్లా అధికారి కమిటీ సభ్యులకు వివరించారు. తాగునీటిపై ఇన్చార్జి మంత్రివర్యులు మాట్లాడుతూ కొంతమంది ఆర్ఓ ప్లాంట్లను నడిపే వ్యక్తులు సరైన అనుమతులు లేకుండా ప్రజలకు త్రాగునీరును నమ్ముతున్నారని కలెక్టర్ కు తెలపగా నేను పై స్పందించిన జిల్లా కలెక్టర్ ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ మరియు జిల్లా పంచాయతీ శాఖ అధికారులను తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారువైద్యం, విద్య, సంక్షేమంవైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి.... అన్నమయ్య జిల్లాలో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం అమలు జిల్లాలో అవసరమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు డాక్టర్ల కొరత తదితర అంశాలను కమిటీ సభ్యులకు వివరించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సిబ్బంది కొరత లేకుండా చూడాలని పలువురు ఎమ్మెల్యేలు జిల్లా కలెక్టర్ మరియు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ 9 మరియు 10వ తరగతిల విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని మై స్కూల్ మై ప్రైడ్ కార్యక్రమాన్ని గత సంవత్సరం నవంబర్ నుండి జిల్లా కలెక్టర్ గారు ప్రారంభించారని దీనిపై స్పందించిన విద్యాశాఖ డైరెక్టర్ అన్నిజిల్లాలలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లుగా వివరించారు. మధ్యాహ్న భోజన పథకం, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై పలు అంశాలను డిఆర్సి కమిటీ సభ్యులకు వివరించారు. డిఆర్డిఏ శాఖ అధికారి శాఖకు సంబంధించిన వివిధ అంశాలను కమిటీ సభ్యులకు వివరించారు. దీనిపై ఇన్చార్జి మంత్రివర్యులు మాట్లాడుతూ డి ఆర్ డి ఎ ఆధ్వర్యంలో అందిస్తున్న సంక్షేమ పథకాలు పక్కాగా అమలవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ లో ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ఉందని ప్రజల సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని అధికారులు అందరూ సమన్వయంతో పని చేస్తున్నారన్నారు. అన్నమయ్య జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా భూగర్భ జలాలు పెరిగాయని ఈ సందర్భంగా జిల్లా అధికార యంత్రంగానికి సీఎం అభినందనలు తెలిపారన్నారు. మిగిలిన జిల్లాలు కూడా అన్నమయ్య జిల్లాను ఒక కేసు స్టడీగా తీసుకోవాలని చెప్పడం మనందరికీ గర్వకారణం అన్నారు. విద్యుత్ లో 100 కోట్లు ఆదా చేయడం జిడిపిలో జిల్లాకు 1100 కోట్లు అదనంగా ఆదాయం పెరగడంపై జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. అధికార యంత్రాంగం కష్టపడి పని చేస్తే వచ్చే గుర్తింపుకు అన్నమయ్య జిల్లా ఒక ఉదాహరణ అన్నారు ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ తాగునీరు రోడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని గత ప్రభుత్వంలో నిలిపివేసిన పెండింగ్ పనులను పరిష్కరిస్తున్నామన్నారు మంత్రి రాంప్రసాద్ రెడ్డి సహచర ఎమ్మెల్యేలు అధికారుల సహకారంతో జిల్లాను రాష్ట్రస్థాయిలో ముందంజలో ఉండేలా చర్యలు చేపడుతున్నామని ఏదైనా పెండింగ్ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర రవాణా క్రీడ యువజన శాఖ మంత్రి మరియు జిల్లా మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూరాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా అన్ని కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం జరుగుతోందన్నారు. శ్రీనివాసపురం రిజర్వాయర్ పనులను వెంటనే పూర్తి చేస్తే రైతాంగానికి మేలు జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని గోశాలల కోసం రైతుల సమర్పించిన దరఖాస్తులను అధిక సంఖ్యలో మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని తెలిపారు. ప్రాజెక్టు జలధర విజయవంతంగా అమలవడంతో భూగర్భ జలాలు పెరిగినందుకు జిల్లా కలెక్టర్ అభినందించారు. రాయచోటి నియోజకవర్గం సంబంధించిన పలు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఇన్చార్జి మంత్రిను మరియు జిల్లా కలెక్టర్ ను కోరారు.

# విద్యార్థిని వేధించపు కేసులో యువకుడి అరెస్టు

కుత్బుల్లాపూర్ బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని విఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాలలో మూడవ సంవత్సరం బీటెక్ విద్యార్థినిపై ఇద్దరు యువకులు వేధింపులు, అఘాయిత్యానికి పాల్పడ్డారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి.. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు, ఆసీస్ అనే విద్యార్థి గత ఒక సంవత్సరం నుంచి తన కుమార్తెను వేధిస్తున్నాడని పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు ఆసీస్ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ప్రవీణ్ అనే మరో యువకుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలు, నిందితులు బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులే కావడం గమనార్హం. బాధితురాలి తల్లి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు బాచుపల్లి పోలీసులు తెలిపారు.

# టీటీడీ ఛైర్మన్ ను తొలగించాలని వైకాపా అందోళన

తిరుపతి తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బి.ఆర్.నాయుడు లక్ష్యంగా వైసీపీ నేతలు నిరసన వ్యక్తం చేశారు. బి.ఆర్.నాయుడు వ్యాఖ్యలు టీటీడీ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉన్నాయని మండిపడుతూ.. అలిపిరి గరుడ సర్కిల్ వద్ద భారీ ధర్నా చేపట్టారు. బి.ఆర్. నాయుడును తక్షణమే ఛైర్మన్ పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ.. సనాతన ధర్మం గురించి మాట్లాడే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని వైసీపీ నేతలు ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

# జడ్చర్ల ఆసుపత్రి ఘటన ఇద్దరిపై వేటు

జడ్చర్ల ఏరియా హాస్పిటల్లో జరిగిన ఘటనపై హెల్త్ మినిస్టర్ దామోదర్ రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేసారు. మంత్రి ఆదేశాలతో హాస్పటల్ ను వైద్య విధాన పరిషత్ కమిషనర్, డాక్టర్ అజయ్ సందర్శించారు. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు, డాక్టర్లు, హాస్పిటల్ స్టాఫ్ నుంచి వివరాలు కమిషనర్ సేకరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించి, ఘటనకు కారకులైన హాస్పిటల్ సూపరింటెండెంట్, డాక్టర్ చంద్రకళ, డ్యూటీ ఆర్ఎంవో డాక్టర్ హరినాథ్, డ్యూటీ మెడికల్ ఆఫీసర్ మునీషా, మార్చురీ సపోర్టింగ్ స్టాఫ్ (ఓఔ) రవిప్రకాశ్లను సస్పెండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అవకుండా కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ అజయ్ కుమార్ తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీలోకి వస్తానంటే ఆహ్వానం పలుకుతాం మావోయిస్టులపై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

హైదరాబాద్ నమ్ముకున్న సిద్ధాంతం కోసం మావోయిస్టులు దశాబ్దాలుగా పని చేశారు. ఆపరేషన్ కగార్ ను మేం వ్యతిరేకించాం. పాకిస్థాన్ తో చర్చలకు ఒప్పుకున్న మోదీ మావోయిస్టులతో చర్చలకు ఒప్పుకోలేదని టీపీసీసీ ఛీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

మావోయిస్ట సిద్ధాంతంతో మాకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ప్రజల కోసం పోరాడిన వాళ్లపై గౌరవం ఉంటుంది. మేమయినా, మావోయిస్టులు అయినా పేద ప్రజల కోసమే పోరాటం చేశాం. లొంగిపోయిన మావోయిస్టులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తానంటే ఆహ్వానం పలుకుతాం. మేం ఎవరిని అడగలేదని అన్నారు.

# ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఓ మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్కలు



జడ్చర్ల మార్చ్ 3 ;: ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఓ మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న సంఘటన మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... నాగసాల గ్రామానికి చెందిన పోలే భీమేశ్వర్ అనే వ్యక్తి లారీ డ్రైవర్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భీమేశ్వర్ చెరువులో పడి అనుమానాస్పదంగా మృతి చెందాడు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మార్చురీలో ఉన్న శవాన్ని కుక్కలు పీక్కుతిన్నాయి. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రకళ స్పందించారు. సిబ్బంది మార్చురీలోకి వెళ్తుండగా కుక్కలు అందులోనికి వెళ్లాయని వివరణ ఇచ్చాడు. ఈ మధ్యనే 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చారు. కానీ మార్చురీలో మాత్రం సదుపాయాలు కల్పించకపోవడంతో పాత మార్చురీనే నిర్వహిస్తున్నారు. మార్చురీలో శవాన్ని తీసుకెళ్లాలంటేన బంధువులు భయపడుతున్నారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వింతవింత రాజకీయ చేష్టలకు పాల్పడుతోంది

## బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్




హైదరాబాద్ మార్చ్ 3 గత మూడు నాలుగు రోజులుగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వింతవింత రాజకీయ చేష్టలకు పాల్పడుతోంది. అధికారంలోకి వచ్చి 26 నెలలు కావొస్తున్నా, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో మాత్రం పూర్తిగా విఫలమైందని బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్ విమర్శించారు. మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 6 గ్యారంటీలు సహా అన్ని హామీలు అమలు చేస్తామని గొప్పగా ప్రకటించారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారు. ప్రజలు ఇప్పుడు "ఎందుకు కాంగ్రెస్‌కు ఓటేశామా?" అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మూసీ పునరుజ్జీవం పేరుతో, గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరిట ప్రజల భూములపై కాంగ్రెస్ ప్రభుత్వం కన్నేసింది. మూసీ, ఈసా నదులు కలిసే ప్రాంతానికి సమీపంలో ఉన్న ప్రైవేట్ వ్యక్తుల భూములను అగ్గువ ధరలకు స్వాధీనం చేసుకుని కాంట్రాక్టర్లకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందన్నారు. తరతరాలుగా వారసత్వంగా వచ్చిన ఖరీదైన పట్టా భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపాదిత గాంధీ సరోవర్‌కు దూరంగా ఉన్న భూములను కూడా కాజేసే ప్రయత్నం జరుగుతోంది మూసీ బఫర్ జోన్ విషయంలో ప్రభుత్వం ఇప్పుడు రకరకాల ప్రకటనలు చేస్తోంది. కానీ ఇదే ప్రాంతాల్లో గతంలో అధికారంలో ఉన్నప్పుడు అపార్ట్‌మెంట్లకు అనుమతులు ఇచ్చింది. ఇప్పుడు అన్ని పర్మిషన్లు ఉన్న పేదల ఇళ్లను కూల్చివేయడం అన్యాయం. కొందరు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ గారిని, రేవంత్ రెడ్డిని పోలుస్తూ చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు.. యూపీలో బుల్డోజర్ చర్యలు ప్రభుత్వ భూములను ఆక్రమించినవారిపై, మాఫియా, క్రిమినల్ ఎలిమెంట్స్‌పై మాత్రమే జరుగుతున్నాయి. యోగి ఆదిత్యనాథ్ గారు ప్రజా హక్కులను కాపాడుతూ, నేరస్థులపై, ఇల్లీగల్ స్ట్రక్చర్స్‌పై మాత్రమే బుల్డోజర్లను ఉపయోగిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపైనే చర్యలు తీసుకుంటున్నారు. కానీ తెలంగాణలో మాత్రం లీగల్ నిర్మాణాలపైనా, పేదల ఇండ్లను కూల్చుతూ గడ్డపార ప్రభుత్వంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. కేరళలో ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ నుంచి గాంధీ కుటుంబానికి వెయ్యి కోట్లు పంపాలంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం దారుణం. తెలంగాణలో ప్రజలు ఆత్మహత్యలు... కాంగ్రెస్ మాత్రం వసూళ్లు వైద్యం చేయించుకోలేక, రిటైర్మెంట్ డబ్బులు రాక, అప్పుల భారం తట్టుకోలేక ప్రజలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం "రూ.1000 కోట్లు" అంటున్నాడు. ఇంత దారుణం మరెక్కడాలేదు. సీఎం రేవంత్ రెడ్డి "రాహుల్ గాంధీని ప్రధాని చేస్తామని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. కాబట్టి రేవంత్ ఆశ నెరవేరదనే విషయం గుర్తుంచుకోవాలి. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కనుమరుగవుతోంది. కేవలం కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉంది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పరిస్థితి దిగజారింది. ప్రస్తుతం కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పరిమితమై ఉంది. కర్ణాటకలో కిస్సా కుర్సీకా అనే మాదిరిగా సీఎం, డిప్యూటీ సీఎం మధ్య కుర్చీ కొట్లాట జరుగుతోంది. అధికార పోరు, అంతర్గత విభేదాలు బహిరంగంగానే కనిపిస్తున్నాయి. ఇటు తెలంగాణలో ఖమ్మం బ్యాచ్, మరోవైపు నల్లగొండ బ్యాచ్ రేవంత్ రెడ్డి సీటుకు ఎసరు పెట్టి ఎప్పుడు సీఎం అవుదామనే ఎదురుచూస్తున్నరు. ఇలా కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రధాని దేశ ప్రజలలో గొప్ప విశ్వాసాన్ని పొందారు. ప్రపంచ దేశాలు కూడా ఆయనను స్ట్రాంగ్ లీడర్‌గా చూస్తున్నాయి. దేశంలో సుపరిపాలన, అభివృద్ధి, భద్రత అందించడం ఆయనకే సాధ్యమైంది. ఈ క్రమంలో వరుసగా మూడుసార్లు ప్రధానమంత్రి అయ్యారు. మోదీ ప్రభుత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకెళ్తోంది. అందుకే 2047 వరకు దేశ ప్రజల విశ్వాసంతో ప్రధానమంత్రి పదవి బలంగా కొనసాగుతుంది. 2047 వరకు ప్రధానమంత్రి సీటు ఖాళీ లేదు. కాని సీఎం రేవంత్ రెడ్డి ఒక విషయం స్పష్టంగా గుర్తుంచుకోవాలి.. వైఫల్యాలతో, ఫెయిల్యూర్ పాలనతో, గడ్డపార పాలనతో తెలంగాణ రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నందుకు ప్రజలు తగిన సమాధానం చెప్పే రోజు దూరంలో లేదు. 2028లో మార్పు ఖాయం. భారతీయ జనతా పార్టీ విజయం సాధిస్తుంది. బీజేపీ అభ్యర్థే తెలంగాణ ముఖ్యమంత్రి అవుతారు. రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటనకు వచ్చి ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఢిల్లీకి వెళ్లిపోయారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదు.లి ఎన్నికల ముందు అశోక్‌నగర్ కు వచ్చిన రాహుల్ గాంధీ నిరుద్యోగులతో సమావేశమై రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాని ఆ హామీని నెరవేర్చలేదు. రాహుల్ గాంధీకి, అదే నిరుద్యోగుల ముందుకు వెళ్లే ధైర్యం ఉందా? అందుకే ప్రజలకు మొహం చూపించే ధైర్యంలేక తోకముడిచారు.లి అబద్ధాలతో రాజ్యాంగాన్ని పదేపదే అవమానపరుస్తూ, రాజ్యాంగ వ్యవస్థలను, ఎన్నికల కమిషన్ ను అవమానపర్చేలా, కించపర్చేలా మాట్లాడుతున్న రాహుల్ గాంధీకి అర్హత లేదు. గ్యారంటీలు, హామీలు నెరవేర్చలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సీఎం కుర్చీని కాపాడుకునేందుకు... రాహుల్ గాంధీని పొగడ్తలతో ముంచెత్తి భజన చేస్తున్నారని ఎద్దేవా చేసారు.. 150 డివిజన్లు ఉన్న జీహెచ్ఎంసీని 300 డివిజన్లుగా విభజించి, ఒక్క కార్పొరేషన్‌ను అశాస్త్రీయంగా మూడు ముక్కలుగా చేయడం వెనుక భారతీయ జనతా పార్టీని రాజకీయంగా దెబ్బతీయాలనే అక్కసే కారణం. ఉదాహరణకు... బిల్డింగ్ పర్మిషన్ ఇచ్చేది ఒక కార్పొరేషన్ లో అయితే.. ఎన్ వోసీ తీసుకోవాలంటే కార్పొరేషన్ కు లేదా మరోచోటకు వెళ్లాల్సివస్తోంది. ఇది దుస్థితి. హైదరాబాద్ కోర్ సిటీని మజ్లిస్ పార్టీకి అప్పగించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ సర్కారులో నగర పాలన పూర్తిగా గాడి తప్పింది. హైదరాబాద్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తీవ్రమయ్యాయి. చెత్త నిర్వహణ దారుణంగా ఉంది, తాగునీటి కొరత, రోడ్ల దుస్థితి, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానం, ట్రాఫిక్ అస్తవ్యస్త పరిస్థితి--- ఇవన్నీ ప్రభుత్వ వైఫల్యాలను స్పష్టంగా చూపిస్తున్నాయి జీహెచ్ఎంసీ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం తగిన నిధులు కేటాయించలేదు. మౌలిక సదుపాయాలపై సరైన శ్రద్ధ లేదు. పారిశుధ్యం, రోడ్లు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఫలితంగా హైదరాబాద్ నగరం అభివృద్ధి పరంగా వెనుకబడుతోంది. కేంద్ర ప్రభుత్వం సాస్కి (రాజావషఋఝశ్రీ ౼ాంంఅర్ఝఅఎవ ˜శీ క్ఫ్వం టశీతీ ఋఝఝఞశ్రీ ×అజవర్ఎవత్) పథకం కింద తెలంగాణ పురపాలక శాఖకు రూ.650 కోట్ల వడ్డీలేని రుణాన్ని మంజూరు చేసిందని తెలిపారు. ఇది గత పదేళ్లలో రాష్ట్రానికి అందిన అత్యంత పెద్ద మొత్తాల్లో ఒకటి. ఈ మూలధన పెట్టుబడి నిధులు మునిసిపాలిటీల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, రోడ్లు, పట్టణీకరణ, జియో ట్యాగింగ్, ఆస్తి పన్నుల డిజిటలైజేషన్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన వంటి సమగ్ర సంస్కరణలకు వినియోగించేందుకు ఉద్దేశించబడ్డాయన్నారు. 50 ఏళ్ల కాలపరిమితితో, వడ్డీలేమీ లేకుండా ఈ రుణం ఇవ్వడం ద్వారా కేంద్రం తెలంగాణ పట్టణాభివృద్ధికి విశ్వసనీయ మద్దతు అందిస్తోందన్నారు.. మొదటి దశలో రూ.650 కోట్లు విడుదల కాగా, సరైన వినియోగం ఆధారంగా త్వరలో మరో రూ.250 కోట్లు అందే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఓవైపు తెలంగాణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుంటే.. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం విభిన్నంగా వ్యవహరిస్తోంది. జీహెచ్ఎంసీని అవ్యవస్థితంగా మూడు ముక్కలుగా విభజించడం ద్వారా వ్యవస్థలను బలహీనపరుస్తోంది. ఇది ప్రజలకు తీరని అన్యాయం మాత్రమే కాకుండా, కేంద్రం ఇచ్చిన నిధుల సద్వినియోగానికి కూడా పెద్ద అడ్డంకిగా మారే ప్రమాదం ఉందన్నారు..ఈ మీడియా సమావేశంలో బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు , బిజెపి సోషల్ మీడియా స్టేట్ కన్వీనర్ సుమిరన్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా హోలీ వేడుకలు.. అధికారులు,సిబ్బందిలో స్టైప్పులతో ఉత్సాహాన్ని నింపిన జిల్లా ఎస్పీ మహేష్ బి.గీతే.



**రాజన్న సిరిసిల్ల జిల్లా ,మార్చ్ 3 (ప్రజాబలం ప్రతినిధి)**జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో హోలీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు.జిల్లా ఎస్పీ మహేష్ బీ. గీతే ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంతోషంగా వేడుకలను జరుపుకున్నారు.ఈసందర్భంగా ఎస్పీ జిల్లా ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ,హోలీ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం,ఐక్యత,కోత్త ఉత్సాహం, వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.పోలీసు కుటుంబంలో స్నేహభావం, ఐక్యత మరింత బలపడేలా ఈ వేడుకలు నిర్వహించబడినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ లు,ఆర్.ఐ లు, ఎస్.ఐ

## నంది ఈశ్వరుని దర్శనం చేసుకున్న ఏపీవో అంజిరెడ్డి




**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి మార్చి 3 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** నంది ఈశ్వరుని దర్శించుకున్న మర్పల్లి ఏపీవో అంజిరెడ్డి పరిశుద్ధ స్థలము అయినా దేవుని మందిరాలు అంటే ఏపీవో కి బహుప్రియము మందిరంలో గడుపుట బహు ఆనందము దేవాది దేవుండ్ల కృప ఆశీర్వాదము సదా ఉండాలని వారు దేవుని సన్నిధిలో దేవుని మందిరాలలో పూజలు అర్చనలు చేయడము బహు ప్రియముగా ఆస్వాదిస్తారు భక్తిశ్రద్ధలతో భయభక్తులతో ప్రియమారా దేవుని సన్నిధిలో ఎక్కువ గడపటానికి చాలా ఆసక్తి చూపిస్తూ ఉంటారు అందరూ బాగుండాలి అందులో మనం కూడా బాగుండాలి అని చెబుతూ ఉంటారు మర్పల్లి ఏపీవో అంజిరెడ్డి అని తెలిపారు

# పంచలింగాల్ లో అందరూ కలిసి ఆనందంగాజరుపుకుంటున్నపశీడగ హోలీ



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి మార్చి 3(ప్రజాబలం)** వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలం పంచలింగాల్, గ్రామంలో ప్రేమానురాగాలకు అతీతంగాశాంతికి సుబ్రౌత్రా త్వానికి... ప్రతిక అన్ని వర్గాలను ఏకం చేసే వేడుక ఈ రంగుల హోలీ పండుగ అని తెలిపారు చిన్నలు పెద్దలు యువకులు అందరూ కలిసి ఎంతో ఆనందంగా ఉల్లాసంగా చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ హోలీ పండుగ ఘనంగా సంబరాలు జరుపుకున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని గ్రామంలో గల్లి గల్లి తిరుగుతూ యువత అంతా కలిసి ఎంతో ఆనందాన్ని ఆస్వాదించుకుంటూ ప్రేమానురాగాలతో కన్నుల పండుగ లారంగుల పండగ జరుపుకున్నామని తెలిపారు కార్యక్రమంలో



పెద్దలు యువకులు అందరూ పాల్గొని సంతోషాన్ని ఆనందాన్ని అందరితో కలిసి పంచుకున్నామని తెలిపారు

# వికారాబాద్ లో అందరూ కలిసి ఆనందంగాజరుపుకుంటున్నపశీడగ హోలీ

**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి మార్చి 3(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** వికారాబాద్ టౌన్ లో ప్రేమానురాగాలకు అతీతంగాశాంతికి సుబ్రౌత్రా త్వానికి... ప్రతిక అన్ని వర్గాలను ఏకం చేసే వేడుక ఈ రంగుల హోలీ పండుగ అని తెలిపారు చిన్నలు పెద్దలు యువకులు అందరూ కలిసి ఎంతో ఆనందంగా ఉల్లాసంగా చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ హోలీ పండుగ ఘనంగా సంబరాలు జరుపుకున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని గ్రామంలో గల్లి గల్లి తిరుగుతూ యువత అంతా కలిసి ఎంతో ఆనందాన్ని ఆస్వాదించుకుంటూ ప్రేమానురాగాలతో కన్నుల పండుగ లారంగుల పండగ జరుపుకున్నామని తెలిపారు కార్యక్రమంలో పెద్దలు యువకులు అందరూ పాల్గొని సంతోషాన్ని ఆనందాన్ని అందరితో కలిసి పంచుకున్నామని తెలిపారు





# హోలీ పండగను ఘనంగా జరుపుకున్న పి పి టి బ్యాచ్



**ప్రజాబలం దినపత్రిక మార్చి -03**వేములవాడ పట్టణంలోని హోలీ పండుగను పట్టణానికి చెందిన పి పి టి బ్యాచ్ సభ్యులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోలీ పండుగ అనేది మన పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం అని పండగ రోజున స్నేహితులందరం కలిసి రంగులతో ఒకరినొకరు ఆత్మీయంగా హోలీ పండగను జరుపుకుంటామని అది మాస్నేహాను బంధాలకి ఇదొక ప్రతికగా ప్రతి ఒక్కరి జీవితాలలో వెలుగులు నింపాలని కోరుకుంటున్నామని వారన్నారు.

# ఖమ్మం నగరంలో నేడే హోలీ సంబరాలు







**ఖమ్మం ప్రతినిధి మార్చి 3 (ప్రజాబలం)** స్థానిక ఖమ్మం హెవిలియన్ గ్రౌండ్ నందు గురువారం నాడు యాంకర్ సబిత ఆధ్వర్యంలో ఖమ్మం హోలీ మీటింగ్ పెద్ద ఎత్తున జరగబోతుందని ఈ హోలీ సంబరాలకు ఖమ్మం నగరంలో ప్రజలందరూ రావాలని ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఖమ్మం రంగు స్టావ్ హోలీ మేళ పోస్టర్ ఆవిష్కరణ చట్టం జరిగింది. ఈ సందర్భంగా యాంకర్ సబితా మాట్లాడుతూ ఈ హోలీ సంబరాలను యువతి యువకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని అదేవిధంగా ఈ హోలీ సంబరాలకు జబర్దస్త్ నుండి ఆర్టిస్టులు కూడా పాల్గొంటారని ఈ సందర్భంగా వారు తెలియజేసినారు ఈ హోలీ మేళ్లకు టికెట్లు కావలసిన వాళ్లు స్థానిక పెవిలిన్ గ్రౌండ్ నందు 9848494996 9948959572 అనే నెంబర్కు గల వారి దగ్గర దొరుకుతాయని ఈ సందర్భంగా వారు తెలియజేసినారు. ఆసక్తి వారు ఎవరైనా ఉంటే నేరుగా పేవిలియన్ దగ్గరకు వచ్చిపాస్ లు తీసుకోగలరని ఈ సందర్భంగా వాళ్లు తెలియజేసినారు. ఈ హోలీ మేళకి ప్రొడక్షన్ పార్ట్నర్ బై లి== ఆర్థో అండ్ యాక్సిడెంట్ కేర్ హస్పటల్ ఖమ్మం, మెర్సీ ఆడియో, నాగోల్ డెకరేషన్ అండ్ ఈవెంట్స్, తంబి డెకరేషన్ అండ్ ఈవెంట్స్ ఖమ్మం మరియు చందు ఫోటో వీడియోస్, ఈ కార్యక్రమానికి స్పాన్సర్గా వ్యవహరిస్తున్నారు ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ తదితరులు పాల్గొన్నారు

# వేములవాడలో వీధి కుక్కల స్వైర విహారం

## 25 మందికి పైగా కరిచిన పిచ్చికుక్క

## మెరుగైన వైద్యం అందిస్తాం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



**ప్రజాబలం దినపత్రిక మార్చి -03**వేములవాడ పట్టణంలో వీధి కుక్కలు స్వైర విహారం చేసి 25 మందికి పైగా కరిచి గాయాల పాలు చేసింది. వివరాల్లోకెళ్తే వేములవాడ పట్టణంలో వీధికుక్కలు రోగాల బారిన పడి మనుషులపై దాడి చేస్తున్నాయి. ప్రధాన వీధుల్లో సంచరించిన కుక్క దాడికి ప్రజలు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. అందులో కొందరు రాజన్న భక్తులు ఉన్నారు. కుక్క దాడి చేసిన వారిని ఏరియా ఆసుపత్రికి తరలించగా వారికి రెబిస్ నిరోధక టీకాలు అవసరమైన చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న వెంటనే ఆసుపత్రికి చేరుకున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా పూర్తి స్థాయిలో వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని 15 రోజుల క్రితమే 40 కుక్కలను ఏ బి సి కేంద్రానికి తరలించామని కుక్కలను పట్టుకోడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించామని ఎవరు భయపడాల్సిన అవసరం లేదని వారన్నారు.

# పిచ్చికుక్కల బెడద పై మున్సిపల్ పాలకవర్గం తక్షణ చర్యలు అవసరం

## మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు



**ప్రజాబలం దినపత్రిక మార్చి 03**వేములవాడ పట్టణంలోని మంగళవారం రోజున పిచ్చికుక్క దాడి ఘటన తీవ్ర ఆందోళన కలిగించిందని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 మందికి పైగా పిచ్చికుక్క కరవడం చాలా బాధాకరమని వారికి మెరుగైన వైద్యం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వేములవాడ ఏరియా ఆసుపత్రిలో గాయాలైన వారిని పరామర్శించారు. ప్రతి ఒక్కరికి సమూచిత వైద్యం అందేలా చూడాలని అవసరమైతే మెరుగైన వైద్యం కోసం ఉన్నత వైద్య కేంద్రాలకు తరలించాలని వైద్యులకు సూచించారు. మున్సిపల్ పాలకవర్గ తక్షణ చర్యలు అవసరం పట్టణంలో వీధి కుక్కల సమస్య నియంత్రణలో లేకపోవడం బాధాకరం అని, కుక్కలు తీవ్రమైన అనారోగ్యానికి గురై రక్తస్రావం జరుగుతున్న దృశ్యాలు దేవాలయ పరిసర ప్రాంతాలలో అలాగే పట్టణ ప్రాంతాల్లో చాలా సంచరిస్తున్నాయి అని. ముఖ్యంగా స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని కుక్క కరిస్తే సరైన సమయంలో టీకాలు తీసుకోకపోతే రేబిస్ వ్యాధి వచ్చి చనిపోయే ప్రమాదం పొంచి ఉంటుందని కావున ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా మున్సిపల్ అధికారులు తక్షణమే సమగ్రమైన చర్యలు చేపట్టాలని వెంటనే వీధి కుక్కల పట్టివేత, శస్త్ర చికిత్సలు, ఏ బి సి కార్యక్రమం క్రమబద్ధంగా అమలు చేయాలని పట్టణ ప్రజల ప్రాణ భద్రతకు ఎలాంటి లోటుపాటు ఉండకూడదని వారన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com